ఈనెల 20న సిద్దిపేట విద్యుత్ భవన్‌లో విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

-డిఈ రామచంద్రయ్య

సిద్దిపేట రూరల్, జనవరి 15, ప్రభాతవార్త:

విద్యుత్ వినియోగదారుల సమస్యలపై జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలోని విద్యుత్ భవన్‌లో ఈనెల 20న సిజిఆర్ఎఫ్(కస్టమర్ గ్రీవెన్సెస్ రీడ్రెసెల్ ఫోరం) హైదరాబాద్ ఆధ్వర్యంలో వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించడం జరుగుతుందని సిద్దిపేట డివిజనల్ విద్యుత్ డిఈ కె.రామచంద్రయ్య శుక్రవారం తెలిపారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి హాజరయ్యే వారు కరెంట్ బిల్లు రశీదు, ఆధార్ కార్డు తీసుకొని రావాలన్నారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గ్రీవెన్స్ డే నిర్వహించడం జరుగుతుందన్నారు. సిద్దిపేట డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పాఠశాల నిర్మాణానికి కేంద్ర మంత్రుల హామీ

-వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గంగ జోగినాథ్

అల్లాదుర్గం, జనవరి 16, ప్రభాతవార్త:

మండల పరిధిలోని గడిపెద్దాపూరర్‌లో పాఠశాల గదుల నిర్మాణానికి కేంద్ర మంత్రులు హామీ ఇచ్చినట్లు జోగిపేట వ్యవసాయ మార్కెట్‌కమిటీ మాజీ చైర్మన్ గంగ జోగినాథ్ తెలిపారు. గడిపెద్దాపూర్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో జోగినాథ్ మాట్లాడుతూ విద్యార్థులకు అనుగుణంగా పాఠశాలలో 12 గదుల నిర్మాణానికి చేస్తున్న కృషిలోభాగంగా కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్, కిషన్‌రెడ్డిల సహకారంతో అరబిందో కంపెనీ వైస్ చైరర్మన్ ఎ.నిత్యానంద్‌రెడ్డి పాఠశాలలో 6గదుల నిర్మాణానికి సై అన్నారని, మిగతా 6గదుల నిర్మాణానికి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సి.దామోదర్ రాజనర్సింహా సహాయంకోసం అడగనున్నట్లు పేర్కొన్నారు. గ్రామంలోని ప్రాథమికపాఠశాల మరమ్మతులకు ప్రయత్నాలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు శేషారెడ్డి, మాజీ ఎంపిటిసి సభ్యులు విఠల్‌రెడ్డి, నాయకులు దుర్గారెడ్డి, ప్రసాద్, రాజుగౌడ్‌లు పాల్గొన్నారు.

స్వామివారిని దర్శించుకున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ దంపతులు

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ దంపతులకు స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న దృశ్యం

కొమురవెల్లి, జనవరి 16, ప్రభాతవార్త:

మండల కేంద్రంలోని శ్రీకొమురవెల్లి మల్లికార్జునస్వామిని రాష్ట్ర షెడ్యూల్‌కులాల అభివృద్ధి, గిరిజన సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ దంపతులు శుక్రవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజలు నిర్వహించిన అనంతరం బోనాలుసమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈసందర్భంగా దేవాలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. స్వామివారి పూజ అనంతరం అర్చకులు ఆశీర్వచన మండపంలో మంత్రి దంపతులకు స్వామివారి శేష వస్త్రాలు, చిత్రపటం, ప్రసాదం, వేద ఆశీర్వచనం అందించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో వెంకటేష్, ఉత్సవకమిటీ చైర్మన్ గంగం నరసింహ్మరెడ్డి, కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షులు మహాదేవుని శ్రీనివాస్, ఆలయ పర్యవేక్షకులు చంద్రశేఖర్, ఉత్సవకమిటీ సభ్యులు సార్ల లింగం, ఎల్లయ్యయాదవ్, ఎలిగేల మల్లేశం, వంగరి వరలక్ష్మీనాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎంపికి అయ్యప్పప్రసాదం అందజేత



ఎంపి సురేష్ కుమార్ శెట్కార్‌కి ప్రసాదాన్ని అందజేస్తున్న దృశ్యం

నారాయణఖేడ్, జనవరి 16 ప్రభాతవార్త:

జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ శెట్కార్ కి తెలంగాణ రాష్ట్ర ఉత్తమ రక్తదాత అవార్డు గ్రహీత డాక్టర్.డి. ఓం ప్రకాష్ కలిసి అయ్యప్ప మాల మహా ప్రసాదాన్ని అందించారు. ఇటీవల అయ్యప్ప మాల ధారణ వేసి అయ్యప్ప స్వామిని దర్శించుకుని అయ్యప్ప మహా ప్రసాదని ప్రముఖ సామాజిక సేవకర్త ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు డాక్టర్ డి ఓంప్రకాష్ మహాప్రసదాన్ని అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శాంతయ్య స్వామి, షాపూర్ సర్పంచ్ మహాలింగ్ పాటిల్, నాయకులు రాజునాయక్, శివుకాంత్ పటేల్, ప్రశాంత్, విజయకుమార్ స్వామి, సాయి చరణ్ తదితరులు పాల్గొన్నారు.

చూపరులను ఆకట్టుకున్న చత్రపతి శివాజీ మహారాజ్ త్రీడి ముగ్గు

ఛత్రపతి శివాజి త్రీడి ముగ్గు దృశ్యం

నారాయణఖేడ్, జనవరి 16, ప్రభాతవార్త:

మున్సిపల్ పట్టణ పరిధిలోని సాయిబాబా కాలనీలో లావణ్య-మహాదేవరావు దంపతులు తమ ఇంటి ముందర వేసిన చత్రపతి శివాజీ మహారాజ్ త్రీడీ ముగ్గు చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పండుగ విశిష్టతతో పాటు చరిత్రాత్మక గొప్పతనాన్ని ప్రతిబింబించేలా ఈ ముగ్గును తీర్చిదిద్దారు. సాంప్రదాయ రంగులు, ఆధునిక త్రీడీ కళాశైలిని సమ్మేళనం చేస్తూ రూపొందించిన ఈ ముగ్గు కాలనీవాసుల ప్రశంసలు అందుకుంది. ముగ్గులో చత్రపతి శివాజీ మహారాజ్ రూపాన్ని జీవంతంగా ప్రతిబింబించడంతో అందరి దృష్టిని ఆకర్షించింది. గత పది సంవత్సరాలుగా ప్రతి సంక్రాంతికి ఇలాంటి ప్రత్యేక ముగ్గులు వేస్తూ పండుగ ఆనందాన్ని పంచుకుంటున్నామని లావణ్య-మహాదేవరావు దంపతులు తెలిపారు. సంక్రాంతి సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన ఈ త్రీడీ ముగ్గు పట్టణంలో ప్రత్యేక గుర్తింపును సొంతం చేసుకుంది.

ఆర్టీసీ డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

-గజ్వేల్ ఏసిపి నరసింహులు

కార్యక్రమంలో మాట్లాడుతున్న గజ్వేల్ ఏసిపి నరసింహులు

గజ్వేల్ టౌన్, జనవరి 16, ప్రభాతవార్త:

సిద్దిపేట జిల్లా పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు రోడ్ సేఫ్టీ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ డిపోలో డ్రైవర్లకు, మెకానిక్‌లకు గజ్వేల్ ఏసిపి నరసింహులు, గజ్వేల్ సిఐ రవికుమార్, ట్రాఫిక్ సిఐ మురళిలు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసిపి నరసింహులు మాట్లాడుతూ ఆర్టీసీ డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు, డ్రైవింగ్ చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలు పాటించి డ్రైవింగ్ చేయాలని, అలాగే పార్కింగ్ ప్రదేశాల్లోనే బస్సులను ఆపాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ పవన్‌కుమార్, డిపో సిఐ బాబు, ఆర్టీసీ డ్రైవర్లు, మెకానిక్‌లు తదితరులు పాల్గొన్నారు.

మున్సి'పోల్స్' కు నేతల ముందు చూపు

-ఓటర్లతో అప్పడే ఆశావహుల భాయీ భాయీ...!

-వార్డుల్లో సమస్యలు తెలుసుకొని తక్షణం పరిష్కరించే ప్రయత్నం

నారాయణఖేడ్, జనవరి 16, ప్రభాతవార్త:

మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్డ్ వెలువడక ముందే ఆయావార్డుల్లో ఆశావహులు ఓటర్ మహాశయుల తలుపు తడుతున్నారు. ఎన్నికలబరిలో నిలవడానికి సన్నద్ధం అయిన వారు చాలామంది గత కొన్నిరోజుల నుండి గల్లీలో తిరుగుతూ మీరు ఈ సారి నన్ను ఆశీర్వదించాలని ఆప్యాయంగా పలకరిస్తూ ఓటర్‌లను ప్రసన్నంచేసుకోవడానికి ముమ్మరంగా ప్రయత్నం చేస్తున్నారు. ఎన్నికల్లో బరిలో దిగేందుకు ఉత్సహంచూపుతున్న కొందరు కొంత కాలంగా వార్డుల్లో కొన్ని సేవాకార్యక్రమాలు చేపడుతున్నారు. ఐతే రిజర్వేషన్ కలసి రాకుంటే ఏంచేయాలో అన్నదానికి ప్లాన్-బితో రెడీ అవుతున్నారు. ఒకవేళ మహిళారిజర్వేషన్ వస్తే కుటుంబ సభ్యులను బరిలో దించాలన్న ఆలోచనలతో ముందస్తుగానే ప్రచారం ముమ్మరంగా మొదలు పెట్టారు. ఎన్నికల షెడ్యూల్డ్ ఎప్పుడు వెలువడినా రంగంలోకి దిగేందుకు అవసరమైన డుడ్డు కోసం ప్రయత్నాలుసైతం చేస్తున్నారు. సామాజిక మాధ్యమంలో ప్రచారంచేసుకోవడానికి వీడియో, ఆడియోలు సిద్ధంగా ఉంచుకున్నారు. వార్డుల్లో కలియతిరుగుతూ అక్కడ కూడా అధికారపార్టీ పెద్ద మనుషులు ఎంపి, ఎమ్మెల్యేల ఆశీర్వాదం తనకే ఉందని ప్రచారంసైతం చేస్తున్నారు. అదేవిధంగా ప్రధాన ప్రతిపక్షపార్టీ వారు సైతం మాజీ ఎమ్మెల్యే తనకే టికెట్ ఖరారుచేశారని కొంతమంది పోటీలో వుండే అభ్యర్థులు ప్రచారంచేస్తున్నారు. ఎన్నడూ లేనివిధంగా వార్డుల్లో పలకరిస్తూ తక్షణమే పనులు చేస్తున్నారు. మున్సిపల్ షెడ్యూల్డ్ విడుదల నేపథ్యంలో నారాయణఖేడ్ మున్సిపల్ 15 వార్డులకుగాను ఎన్నికల షెడ్యూల్డ్ రానుండడంతో కొందరు మాజీ కౌన్సిలర్లు ఆయావార్డుల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నారు. పేరుకుపోయిన చెత్తనంతా శుభ్రంచేయిస్తున్నారు. ఎలక్షన్ దగ్గర పడుతుండడంతో కాలనీలోని సిసిరోడ్లను, డ్రైనేజీ సమస్యలను వెంటనే పరిష్కారం చేస్తున్నారు. అభివృద్ధి తమ పార్టీ ద్వారానే అయిందని ఎవరికివారే గొప్పలు చెప్పుకుంటున్నారు. ప్రస్తుతం నారాయణఖేడ్ మున్సిపాల్టీలో బైపాస్ రోడ్, ప్రధానరహదారి అధ్వాన్నంగామారడంతో ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తంచేస్తున్నారు. నిత్యం వందలాదిమంది ప్రయాణంచేసే రహదారి దుమ్ము, ధూళితో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. బైపాస్ రోడ్‌లో సమస్యలు అధికారుల దృష్టికి తీసుకెళ్లడం

నారాయణఖేడ్ మున్సిపల్ కార్యాలయం

తో కాస్త మట్టిపోసి మమ అనిపించుకున్నారు. అక్కడ అధికార పార్టీ కొంత సమస్యలు, మరికొంత అభివృద్ధితో ముందుకు వెళ్ళి ఓటర్లను వేడుకోగా, మరోప్రక్క ప్రతిపక్ష పార్టీవారు తమ హయాంలోనే పట్టణాన్ని సుందరీకరించామని ప్రజల్లోకి వెళ్తున్నారు. ఏది ఏమైనా, ఎవరికివారే యమునాతీరే అన్న చందంగా ముందస్తుగానే ప్రచారం ముమ్మరంగా చేస్తున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే ఎన్నికల షెడ్యూల్డ్ వెలువడిన తరువాత ఎలా ఉంటారో వేచిచూడాల్సిందే.

ఆయుష్ సేవలు ప్రజలకు చేరువచేయాలి

-సిద్ధిపేట జిల్లా కలెక్టర్ హైమావతి

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హైమావతి

సిద్ధిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:

ఆయుష్ (ఆయుర్వేద,యునాని హోమియోపతి) వైద్య సేవలు జిల్లాలోని ప్రజలకు చేరువయ్యేలా పనిచేయాలని జిల్లా కలెక్టర్ హైమావతి ఆయుష్ డాక్టర్లను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయుష్ మెడికల్ ఆఫీసర్లు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఆయుష్ కేంద్రాల్లో మెడికల్ ఆఫీసర్, ఫార్మాసిస్ట్ వేకెన్సీ లిస్ట్ తయారు చేయాలన్నారు. జిల్లాలో నిర్మించిన యోగా షెడ్లలో యోగా ఉపాధ్యాయులు తప్పని సరిగా ప్రజలకు యోగా సేవలు అందించాలన్నారు. ఆసుపత్రిలో ఆయుర్వేద, యునాని, హోమియోపతి వైద్యసేవల వలన ప్రజలకు కలిగే ప్రయోజనాలను ప్రతి ఒక్కరికి తెలపాలన్నారు. ఆయుష్ సేవలను విస్తరించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఓపి సంఖ్య పెంచడంతో పాటు సమయపాలన పాటించాలన్నారు. ఆయుష్ కేంద్రంలో పరికరాలు, మెడిసిన్ కోసం పై అధికారులకు లెటర్ రాసి తెప్పించుకోవాలన్నారు. సిద్దిపేట పట్టణంలోని 50 పడకల ఆయుష్ ఆసుపత్రిని ప్రారంభానికి సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో డిఅండ్ఎంహెచ్ఓ ధనరాజ్, జిల్లా ఆయుష్ ప్రోగ్రాం మేనేజర్ భాను తేజ, జిల్లా ఆయష్ ఇంచార్జి ఉమాదేవి, ఆయుష్ డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐఎస్ఎఫ్ 2026ను విజయవంతం చేయాలి

-జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

రామచంద్రాపురం, జనవరి 16, ప్రభాతవార్త:

సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్-2026 (ఎస్ఐఎస్ఎఫ్)ను అధికారులు సమన్వయం పాటిస్తూ విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. ఈ నెల 19వ తారీఖు నుంచి 23వ తేదీ వరకు రామచంద్రాపురం మండల పరిధిలోని కొల్లూరులోని గాడియం ఇంటర్నేషనల్ స్కూల్‌లో నిర్వహిస్తున్న సందర్భంగా శుక్రవారం కలెక్టర్ ఏర్పాట్లను పరిశీలించారు. ఎంట్రెన్స్, ఎగ్జిట్ మార్గాలు, డ్రైనేజీ ఏర్పాట్లు, ఎగ్జిబిట్ల సంఖ్య, విద్యుత్ కనెక్షన్లు, భద్రతా ఏర్పాట్లను కలెక్టర్ ప్రత్యేకంగా పరిశీలించారు. సైన్స్ ఫెయిర్‌లో పాల్గొననున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు, అతిథులకు అవసరమైన వసతి, భోజనం, రవాణా ఏర్పాట్లపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సౌత్ ఇండియా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, అతిథులు హాజర వుతారని, ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లను చేయాలని బాధ్యులను ఆదేశించామన్నారు. ప్రతి కమిటీ ఎప్పటికి అప్పుడు సమన్వయంతో పనులు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా రిజిస్టార్, రెవిన్యూ డివిజనల్ అధికారి రాజేందర్, జిల్లా సైన్స్ అధికారి సిద్దారెడ్డి, నోడల్ అధికారి లింబాజీ, ఎంఈఓ నాగేశ్వర్ నాయక్, విజయ్‌కుమార్, పటాన్‌చెరు తహసీల్దార్ హరిబాబు, ఆయా కమిటీల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ఫెయిర్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

రోడ్డు ప్రమాదాలను తగ్గించడమే లక్ష్యం

-అదనపు కలెక్టర్ నగేష్

సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ నగేష్

మెదక్ టౌన్ జనవరి 16, ప్రభాత వార్త:

అరైవ్ అలైవ్ నినాదం రక్షణాత్మకంగా డ్రైవ్ చేయడానికి అర్థమని అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. ప్రమాదాల నివారణే లక్ష్యంగా పోలీస్ శాఖ చేపట్టిన ఈ కార్యక్రమం సత్ఫలితాల దిశగా ముందుకు పోతుందని అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. కలెక్టరేట్ కార్యాలయంలో ప్రజావాణి హాల్ నందు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో, అరైవ్ అలైవ్ కార్యక్రమం రోడ్డు ప్రమాదాల నివారణ కార్యక్రమం నిర్వహించారు. అదనపు ఎస్పీ మహేందర్, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ విజయలక్ష్మి, ఆర్డీవోలు మెదక్ రమాదేవి, నర్సాపూర్ మహిపాల్‌రెడ్డి, తూప్రాన్ జై చంద్రారెడ్డి, రూరల్ సిఐ జార్జ్‌తో కలిసి అదనపు కలెక్టర్ నగేష్ పాల్గొన్నారు. కలెక్టరేట్ కార్యాలయ. అధికారులు ఉద్యోగులకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించిన 'అరైవ్ అలైవ్' కార్యక్రమం రోడ్డు ప్రమాదాలను తగ్గించడమే లక్ష్యంగా తీసుకున్న ముఖ్యమైన చర్యగా పేర్కొన్నారు. 'అరైవ్ అలైవ్' రోడ్డు ప్రమాదాల నివారణపై కలెక్టరేట్ కార్యాలయ ఉద్యోగులు అవగాహన కలిగి ఉండాలని ట్రాఫిక్ నిబంధనలు ఉద్యోగులు పాటిస్తూ మరొకరికి ప్రచారం చేస్తూ స్ఫూర్తిగా నిలవాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, రాంగ్‌సైడ్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్ వంటివి రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలని చెప్పారు. ప్రజల సహకారం రోడ్డు భద్రతలో కీలకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్ మాట్లాడుతూ అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని ప్రతి ఇంటికి, ప్రతి వ్యక్తికి చేరవేసి ప్రమాదరహిత జిల్లాగా నిర్మించేందుకు పోలీసులు కట్టుబడి ఉన్నారని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ భద్రతా నియమాలను పాటిస్తే ప్రమాదాలు తగ్గుతాయని అదనపు కలెక్టర్ నగేష్ వివరించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

5 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యం పట్టివేత

పిడిఎస్ బియ్యం ఆటోను పోలీసు ఠాణాకు తరలించిన పోలీసులు

న్యాల్‌కల్, జనవరి 16, ప్రభాతవార్త:

అక్రమంగా పిడిఎస్ బియ్యం తరలిస్తున్న ఆటోను శుక్రవారం హుస్నూర్ పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ దోమ సుజిత్ కథనం ప్రకారం.. శుక్రవారం మండలపరిధిలోని చాల్కిచౌరస్తావద్ద వాహనాలను తనిఖీచేస్తున్న తరుణంలో అటుగా వచ్చిన ఆటో (ఎపి 01 వై 9866)ను తనిఖీచేయగా ఎలాంటి అనుమతులు లేకుండా 5క్వింటాళ్ల పిడిఎస్ బియ్యం తరలిస్తున్నట్లు గుర్తించి, ఆటోను స్వాధీనంచేసుకుని పోలీసుఠాణాకు తరలించామన్నారు. ఆటోను నడుపుతున్న మనూర్ మండలపరిధిలోని పిప్రీ గ్రామానికి చెందిన జాదవ్ పరుషరా (40)ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దోమ సుజిత్ వివరించారు.

భారీఎత్తున చైనా మాంజా పట్టివేత

-ఇద్దరిపై కేసు నమోదు

చైనా మాంజాను స్వాధీనం చేసుకున్న పోలీసులు

జహీరాబాద్, జనవరి 16, ప్రభాతవార్త:

రాష్ట్ర ప్రభుత్వం నిషేదించిన చైనా మాంజాను అమ్ముతున్న ఇద్దరిపై కేసులు నమోదు చేసిన సంఘటన పట్టణంలోని గడివీధిలో చోటుచేసుకుంది. పట్టణ ఎస్ఐ వినోద్‌కుమార్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పటణంలోని గడిమహేలాలో అక్రమంగా చైనా మాంజాను అమ్ముతున్నట్లు తెలుసుకుని దుకాణం గోడౌన్‌పై దాడులుచేసి అమ్మకానికి సిద్ధంగా ఉంచిన చైనా మాంజాను స్వాధీనం చేసుకుని గోడౌన్ యజమాని అజీమ్, అజీమ్ తమ్ముడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

గాలిపటం ఎగరేస్తుండగా యువకుడికి విద్యుత్ షాక్

జహీరాబాద్, జనవరి 16, ప్రభాతవార్త:

ప్రభుత్వం నిషేధించిన చైనా మాంజాను ఉపయోగిస్తూ గాలిపటం ఎగరేస్తూ యువకుడు విద్యుత్‌షాక్‌కు గురైన సంఘటన జహీరాబాద్ మున్సిపల్ పరిధిలోని బాబుమోహన్ కాలనీలో చోటుచేసుకుంది. బీహార్ రాష్ట్రానికి చెందిన నిరాజ్, మనోజ్‌లు పట్టణశివారులోని పరిశ్రమల్లో పనులుచేసుకుంటూ జీవనాన్ని సాగిస్తున్నారు. సంక్రాంతి సందర్భంగా గురువారం మధ్యాహ్నం అద్దెకు ఉంటున్న ఇంటిపై చైనా మాంజాను వినియోగిస్తూ గాలిపటం ఎగరేస్తున్న తరుణంలో చైనామాంజా విద్యుత్‌తీగెలకు తగలడంతో షాక్‌కుగురయి ప్రమాదానికి లోనయ్యారు. విద్యుత్‌షాక్‌కుగురైన యువకులకు పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో ప్రథమచికిత్సలు అందించి మెరుగైనచికిత్సకోసం హైద్రాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బస్సు ఢీకొని వ్యక్తికి గాయాలు

జహీరాబాద్, జనవరి 16, ప్రభాతవార్త:

పట్టణంలోని ఆర్టీసి బస్టాండ్‌లో ఆర్టీసి బస్సు ఢీకొన్న సంఘటనలో పట్టణానికి చెందిన ఖదీర్(35) తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుడిని చికిత్సనిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఇందుకు సంబంధించి పూర్తి వివరాల్లోకి వెళితే... కర్ణాటకలోని భాల్కిసుంచి హైద్రాబాద్‌కు వెళుతున్న కర్ణాటకబస్సు బస్టాండ్‌లోకి వస్తున్న క్రమంలో సీటుకోసం కిటికీలోనుంచి దస్తీవేయడానికి ఖదీర్ పరుగుతీస్తున్న క్రమంలో కాలుజారి కిందపడిపోగా నెమ్మదిగా వెనక్కి వస్తున్న బస్సు ఖదీర్ రెండుకాళ్లపైనుంచి వెళ్లడంతో రెండుకాళ్లు నుజ్జునుజ్జయి. ప్రమాదానికి గురైన ఖదీర్‌ను చికిత్సనిమిత్తం అంబులెన్స్‌లో పట్టణంలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. డిపో మేనేజర్ స్వామి ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్, లైసెన్స్ లేని కేసుల్లో జరిమానా

గజ్వేల్ టౌన్, జనవరి 16, ప్రభాతవార్త:

మద్యంసేవించి వాహనాలు నడిపిన ఇద్దరికి రూ.20వేల జరిమానా విధించడంతోపాటు, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన ముగ్గురికి రూ.15వేల జరిమానా విధించడం జరిగిందని గజ్వేల్ ట్రాఫిక్ సిఐ మురళి తెలిపారు. గజ్వేల్ పట్టణంలోని పలుప్రాంతాలలో వాహనాల తనిఖీ నిర్వహించగా మద్యంసేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన ఇద్దరిని శుక్రవారం గజ్వేల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ స్వాతిగౌడ్ ముందు హాజరుపరచగా విచారణ జరిపి రూ.20వేల జరిమానా విధించడం జరిగిందన్నారు. అలాగే డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన ముగ్గురికి రూ.15వేల జరిమానా విధించినట్లు తెలిపారు.

మాట్లాడుతున్న అమానుల్లాఖాన్, ఇనాయత్ ఆలీ భాఖ్రీ

20న ఆటో డ్రైవర్ల ధర్నా

సైఫాబాద్, జనవరి 16 ప్రభాతవార్త: ఆటో డ్రైవర్ల న్యాయమైన డిమాండ్లను అమలుచేయాలని కోరుతూ ఈ నెల 20వ తేదీన 'ఆటో బంద్-షరాబ్ హటావో-తెలంగాణ బచావో'పేరిట ఇందిరాపార్కువద్ద వేలాది మంది ఆటో డ్రైవర్లతో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని మహాత్మాగాంధీ తెలంగాణ ఆటో డ్రైవర్స్ జెఎసి కన్వీనర్ మహ్మద్ అమానుల్లాఖాన్, తెలంగాణ లేబర్ వేల్ఫేర్ ఫెడరేషన్ (ఐఎల్‌డబ్ల్యూఎఫ్) అధ్యక్షుడు ఇనాయత్ ఆలీ భాఖ్రీ తెలిపారు. గత 12 ఏళ్ళుగా పెంచని ఆటో మీటర్ చార్జీలను ప్రభుత్వం తక్షణమే పెంచాలని, ఏడాదికి 12 వేల రూపాయలు ఒక్కొక్క ఆటో డ్రైవర్‌కు ఇవ్వాల్సిన రెండేళ్ల ఆర్థిక సహాయం 24 వేలు తక్షణమే ఇవ్వాలని, రిజిస్టర్ చేసిన కొత్త ఆటోలకు పర్మిట్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ట్రాఫిక్ చలానాలు ప్రజల బ్యాంకుల ఖాతాల నుంచి ఏచట్టం ప్రకారం వసూలు చేస్తారో, ఫైనాన్షియర్‌ల దోపిడిని అరికట్టడానికి ఏలాంటి చర్యలు తీసుకుంటారో సిఎం సమాధానం చెప్పాలని, ఆర్టీసీ బస్ చార్జీలు పెంచినప్పుడు ఆటో మీటర్ చార్జీలు ఎందుకు పెంచడం లేదని వారు ప్రశ్నించారు. 20వ తేదీన జరిగే ధర్నాలో ఆటో డ్రైవర్లు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు.

మహిళల సంక్షేమానికి కృషి : పద్మ

సమావేశంలో పాల్గొన్న రోకో పద్మ, అనురాధ, లలిత తదతరులు

సైఫాబాద్, జనవరి 12 ప్రభాతవార్త: గౌతమ బుద్ధుడు తాత్విక చింతనతో, రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేద్కర్, రమాబాయి ఆశయాలతో మహిళల అభివృద్ధి, సంక్షేమానికి వెలివాడ తొలిపొద్దు రమాబాయి మహిళా వెల్ఫేర్ అసోసియేషన్ కృషిచేస్తుందని అసోసియేషన్ న్యాయ సలహాదారు, ప్రముఖ న్యాయవాది రోకా పద్మ చెప్పారు. మహిళలు విద్యా, ఉద్యోగ తదితర రంగాలలో అభివృద్ధి చెందినప్పుడే కుటుంబాలు, రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుందని ఆమె స్పష్టం చేశారు. శుక్రవారం వీర్‌నగర్‌లో జరిగిన అసోసియేషన్ సమావేశంలో ఆమె ప్రసంగించారు. మహిళలు తాము అభివృద్ధి చెందడంతోపాటు అట్టడుగున ఉన్న మహిళలకు చేయూత నిచ్చి అభివృద్ధికి తోడ్పాడాలని, అప్పుడే మహనీయుల ఆశయాలు అమలు జరిగినట్లని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వీర్‌నగర్ పంచాయితీ కమిటీ ముఖ్య అధ్యక్షుడు టంటం గట్టయ్య, ఎస్.చెన్నయ్య, మోహనరావు తోపాటు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శులు బోట్టు అనురాధ, మూలె లలిత, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వరం 'గృహజ్యోతి' : కొండెపూడి చంటిబాబు



లబ్ధిదారులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న నాయకులు, అధికారులు.

మెహిదీపట్నం, జనవరి 16, ప్రభాతవార్త : రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహజ్యోతి పథకం పేదలకు వరంలా మారిందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, గోల్కొండ జగదాంబికా దేవాలయ చైర్మన్ కొండపూడి చంటిబాబు అన్నారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం లంగర్ హౌస్ డివిజన్ పరిధిలోని గృహ జ్యోతి లబ్ధిదారులకు ఆయనతో పాటు విద్యుత్ అధికారులు సర్టిఫికెట్లను అందజేశారు. తెలంగాణ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం 6 గ్యారంటీలను అమలు చేస్తుందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గృహజ్యోతి పథకం పేద కుటుంబాలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. లంగర్‌హౌస్ డివిజన్ పరిధిలోని బాపు నగర్, అంబేద్కర్‌నగర్, వినాయకనగర్, రెడ్డి కాలనీలలోని లబ్ధిదారులకు సంక్రాంతి పండుగను పురస్కరించుకొని గృహజ్యోతి పథకం సర్టిఫికెట్లను అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో నాయకులు పరమానందం, ఆకుల చంద్రశేఖర్, గడ్డం శంకర్, యూత్ కాంగ్రెస్ నాయకులు గౌని సంతోష్ గౌడ్ విద్యుత్ అధికారులు మాధవరావు, సాంబశివ, రవీందర్, నసీముద్దీన్, షేక్ సుల్తానా, నిఖిలేష్, శివకుమార్, రమేష్ ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో గోదాదేవి అమ్మవారికి కరీనోము ఉత్సవం

చిక్కడపల్లి జనవరి 16 (ప్రభాతవార్త) : చిక్కడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలలో భాగంగా శుక్రవారం గోదాదేవి అమ్మవారికి కరీనోము ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతోగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక వంశీయులు జి.శ్రీనాథ్‌గౌడ్, ఆలయం అసిస్టెంట్ కమిషనర్ కె. రామాంజనేయులు పర్యవేక్షణలో ఈ కార్యక్రమం శాస్త్రోక్తంగా జరిగింది. ఉత్సవంలో భాగంగా అమ్మవారికి విశేష అభిషేకాలు, అలంకరణలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకను వీక్షించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం భక్తులకు ఆలయ అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది మరియు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని గోదాదేవి కృపకు పాత్రులయ్యారు.

భవానిదేవికి సుశీలనారాయణరెడ్డి సాహితీ పురస్కారం

చిక్కడపల్లి, జనవరి 16 (ప్రభాతవార్త) : ప్రముఖ సాంస్కృతిక సంస్థ రసమయి ప్రతిఏటా విఖ్యాత కవి డాక్టర్ సి.నారాయణరెడ్డి సతీమణి సుశీల పేరిట ప్రదానంచేసే సుశీలనారాయణరెడ్డి సాహితీ పురస్కారానికికి 2026 సంవత్సరానికిగాను ప్రముఖ రచయిత్రి డాక్టర్ చిల్లర భవాని దేవిని ఎంపిక చేసినట్లు సంస్థ అధ్యక్షుడు డాక్టర్ ఏంకె రాము తెలి పారు. గతంలో ఈ పురస్కారం ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ, డాక్టర్ ఆనందారామం,వాసిరెడ్డి సీతా దేవి, తెన్నేటి హేమ లత తదితరులు అందుకున్నారు రచయిత్రులు ప్రతిష్టాత్మకం గా భావించే ఈ అవార్డు గా లక్ష రూపాయల నగదు తో పాటు ప్రశంసా పత్రం జ్ఞాపిక ప్రదానం చేస్తారు. చిల్లర భవాని వివిధ సాహితీ ప్రక్రియలలో ప్రసిద్ధ రచనలు చేశారు స్వతంత్ర అనంతర కాలంలో తెలుగు హిందీ కవిత తులనాత్మక పరిశీలన అంశం పై పరిశోధన చేసి ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారు

కనులపండువగా గోదా రంగనాథస్వామి కళ్యాణం

చిక్కడపల్లి, జనవరి 16 (ప్రభాతవార్త) : వివేక్‌నగర్ శ్రీఆంజనేయస్వామి దేవాలయంలో ధనుర్మాసోత్సవాల సందర్భంగా నిర్వహించిన గోదా రంగనాథస్వామి కళ్యాణం కనులపండువగా సాగింది. ఈఓ మాచర్ల జగన్నాథం ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం పాల్గొన్న భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలను అందించారు.



ఆంజనేయ స్వామి దేవాలయంలో గోదా రంగనాథస్వామి కళ్యాణం

రేపు సికింద్రాబాద్‌లో 'లోహ్రీ సగనా ది' వేడుకలు

సైఫాబాద్, జనవరి 16 ప్రభాతవార్త: పంజాబ్ రాష్ట్రంతో పాటు ఉత్తర భారతదేశంలో అత్యంత ప్రజాదరణ పొందిన పండుగలలో ఒకటైన లోహ్రీ పండుగను ఈ నెల 18వ తేదీన సికింద్రబాద్‌లో లోహ్రీ మేళా పేరిట 27వ 'లోహ్రీ సగనా ది' వేడుకలను నిర్వహిస్తున్నామని పంజాబీ సేవా సమితి అధ్యక్షుడు దీపక్‌కుమార్ జైరథ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈ మేళాకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను దీపక్‌కుమార్ జైరథ్‌తోపాటు సమితి మాజీ అధ్యక్షుడు ప్రదీప్ లూంబా, ఉపాధ్యక్షుడు జగ్మోహన్ స్పదేవ్ కలిసి ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. శీతాకాలం చివరిలో పంజాబీ కుటుంబాలు ఈ లోహ్రీ పండుగను అత్యంత వైభవంగా, సాంప్రదాయ బద్ధంగా కొనసాగుతున్నదన్నారు. ఇందులో భాగంగానే ఈ నెల 18న సికింద్రాబాద్ లోని టివోలీ గార్డెన్‌లో నిర్వహిస్తున్నామన్నారు. ఆ రోజున జరిగే వేడుకల్లో పంజాబీ ప్రజలు రంగు, రంగుల వస్త్రాలను ధరించి ఆవుపేడతో లోహ్రీ దేవతను తయారుచేసి పూజించి కట్టెలు కాల్చి మంటలు

వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దీపక్‌కుమార్ జైరథ్, ప్రతినిధులు

వేసి పాటలు పాడుతూ నృత్యాలు చేస్తూ నువ్వులు, బెల్లం, రేవడిలను వేస్తూ లోక కళ్యాణం కోసం ప్రార్థనలు చేస్తూ స్నేహితులకు, కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలుపుకోవడం జరుగుతుందన్నారు. రాజ్‌కుమార్ గణోత్రి మాట్లాడుతూ జంట నగరాల్లో నివసిస్తున్న పంజాబీలను ఏకతాటిపైకి తీసుకురావడానికి పంజాబీల సంప్రదాయాలను, వారసత్వాన్ని పరిరక్షించుకోవడానికి పంజాబీ సేవా సమితి ప్రతి ఏడాది ఈ వేడుకలను నిర్వహిస్తున్నదన్నారు.

కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ పాల్గొని ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని, అలాగే 'సుందర్ ముద్రియేహో' తోపాటు క్లాసిక్ పంజాబీ జానపద పాటలను ప్రముఖ పంజాబీ గాయకులు గీతాలను ఆలపిస్తారని ఆయన వివరించారు.



మల్లన్న స్వామికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ఘనంగా ముగిసిన మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు

ముషీరాబాద్, జనవరి 16, ప్రభాతవార్త: ముషీరాబాద్ బాకారం మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఈనెల 14వ తేదీ ఏకాదశి నాడు స్వామివారికి పంచామృత అభిషేకాలతో ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు మూడురోజుల పాటు ఘనంగా నిర్వహించారు. అర్చనలు, ఎదుర్కోలు, గంగ తెప్పోత్సవం, గొలుసు తెంపుట మల్లిఖార్జున స్వామికి, బలిజ మేడాలమ్మ, గొల్ల కేతమ్మ అమ్మవార్లతో కళ్యాణోత్సవం, అగ్నిగుండాల ప్రవేశం, ఈదమ్మ పోచమ్మ దేవాలయంకు బోనాలతో ఉత్సవాలు ముగిశాయి. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ సతీసమేతంగా పూజలలో పాల్గొని, స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు, దేవాలయ మేనేజింగ్ ట్రస్టీ నల్లవెల్లి అంజిరెడ్డి, బీఆర్ఎస్ యువనేత ముఠా జైసింహ, దేవాలయ పూజారి కే.మధుసూదనాచారి, స్థానిక బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు కొండా శ్రీధర్‌రెడ్డి, గోరఖ్‌నాథ్, బింగి నవీన్, శివముదిరాజ్, ముచ్చకుర్తి ప్రభాకర్, భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షులు వై.శ్రీనివాస్‌రావు, గాంధీనగర్ డివిజన్ అధ్యక్షులు రాకేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాట్ పీజియన్ పబ్ యజమానిపై కేసు నమోదు

జూబ్లీహిల్స్, జనవరి 16, ప్రభాతవార్త : జూబ్లీహిల్స్ రోడ్ నంబరు 45 లోని ఫ్యాట్‌పీజియన్ పబ్‌యజమానిపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. జూబ్లీహిల్స్ రోడ్ నంబరు 45లో ఫ్యాట్ పీజియన్ పబ్ ఉంది. కాగా గురువారం సాయంత్రం రోడ్ నంబరు 45లో సీఎం రూట్ ఉంది. ఈ క్రమంలోనే ఫ్యాట్ పీజియన్‌కు వచ్చే వాహనాలతో రోడ్డుపై ట్రాఫిక్ జాంకు పాల్పడ్డాడు. సరైన పార్కింగ్ సౌకర్యం లేకపోవడం, ఇక్కడ వాహనాల రాకపోకలను అడ్డగించేలా రోడ్డుపై వాహనాలు పార్కింగ్ చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు పబ్ యజమాని కేతన్ అగర్వాల్‌పై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. అతనికి నోటీసులు జారీ చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. చాలా కాలంగా మూసి ఉన్న ఈ పబ్ ఇటీవలే రిన్నోవేషన్ చేసుకొని తెరుచుకుంది. గతంలోనూ ఈ పబ్‌పై జూబ్లీహిల్స్ ఠాణాలో కేసులు నమోదై ఉన్నాయి.

పూల్‌బాగ్ వద్ద పల్టీకొట్టిన కూరగాయల వ్యాన్

చాంద్రాయణగుట్ట, జనవరి 16, ప్రభాతవార్త : ఆకుకూరల లోడ్‌తో వెళుతున్న ఒక వ్యాన్ అదుపుతప్పి పల్టీకొట్టింది. పోలీసుల వెంటనే అప్రమత్తమై స్థానికుల సహాయంతో డ్రైవర్‌ను క్షేమంగా బయటకు తీశారు. ప్రధాన రోడ్డుపై ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు. వివరాలలోకి వెళితే.. శుక్రవారం అర్ధరాత్రి కంచన్‌బాగ్ హఫీజ్‌బాబానగర్ మీదుగా చాంద్రాయణగుట్ట వైపు వెళుతున్న ఆకుకూరల లోడ్‌తో ఉన్న వ్యాన్ పూల్‌బాగ్ చౌరస్తా వద్దకు రాగానే అదుపుతప్పి నడిరోడ్డుపై పడిపోయింది. విషయం తెలుసుకున్న చాంద్రాయణగుట్ట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎం.దాసు, సిబ్బంది సహాయంతో సంఘటనా స్థలానికి చేరుకొని వాహన డ్రైవర్‌ను క్షేమంగా బయటకు తీశారు. వాహనం ముందు అద్దం పగిలిపోయి, ఎడమవైపు పైకప్పు పాడైయింది. నడిరోడ్డుపై ఉన్న వ్యాన్‌ను పక్కకు తొలగించారు. నడిరోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయిన ఆకుకూరల పెట్టెలను వాహనాలకు అడ్డులేకుండా తొలగించారు. ఆ మార్గంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు.

భవనంపై నుంచి పడి సెంట్రింగ్ కార్మికుడి మృతి

అల్వాల్, జనవరి 16 ప్రభాతవార్త: ప్రమాదవశాత్తు భవనం పైనుంచి పడి సెంట్రింగ్ కార్మికుడు మృతి చెందిన సంఘటన అల్వాల్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. ఒరిస్సా రాష్ట్రానికి చెందిన సెంట్రింగ్ కార్మికుడు భీమ(30) జీవనోపాదికి నగరానికి సంవత్సరం క్రితం వచ్చాడు. ఓల్డ్ అల్వాల్‌లోని లక్ష్మీ ఎన్‌క్లేవ్‌లో నిర్మాణంలో ఉన్న ఐదు అంతస్తులు భవనం వద్ద సెంట్రింగ్ పనులు చేస్తున్నాడు. ఈ నెల 15 గురువారం సాయంత్రం ఐదు గంటలు సమయంలో ప్రమాదవశాత్తు భీమ ఐదవ అంతస్తు నుంచి కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతను అక్కడిక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆకట్టుకున్న మహిళల జానపద నృత్య ప్రదర్శన

శిల్పారామానికి తరలివచ్చిన నగర ప్రజలు

గచ్చిబౌలి, జనవరి 16 ప్రభాతవార్త : సంక్రాంతి వేడుకల్లో అతి ముఖ్యమైన కనుమ పండుగ సంబరాలకు పట్టణ ప్రజలు శిల్పారామానికి శుక్రవారం తరలివచ్చారు. మాదాపూర్ హైటెక్‌సిటీలోని శిల్పారామంలో నిర్వహిస్తున్న సంక్రాంతి సంబరాల్లో భాగంగా పండుగ చివరి రోజు కనుమ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గంగిరెద్దుల విన్యాసాలు,హరిదాసుల కీర్తనలు, బుడబుక్కల, జంగమదేవరుల, ఎరుకలసాని, పిట్టలదొర తదితర జానపద కళారూపాల ప్రదర్శనలు సందర్శకులను ఆలరించాయి. పని ఒత్తిడి, ఇతర కారణాలతో పల్లెలకు పోలేని నగర వాసులకు శిల్పారామంలో నిర్వహించిన సంక్రాంతివేడుకలు అచ్చమైన పల్లెటూరి సాంప్రదాయాన్ని పరిచయం చేశాయి. సంక్రాంతి పండుగలో అతి ముఖ్యమైన చివరి రోజు వేడుకలు కనుమ పండుగను హైటెక్‌సిటీ శిల్పారామంలో శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు నగర వాసులు భారీ ఎత్తున తరలిరావడంతో శిల్పారామం శుక్రవారం కిక్కిరిసిపోయింది. ముఖ్యంగా గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసుల కీర్తనలు, బుడబుక్కల, జంగమదేవరుల, పిట్టల దోరల వేషధారణలు సందర్శకులకు కట్టిపడేశాయి. సాంక్రాంతి పండుగలో భాగంగా కనుమ వేడుకలల్లో ఉత్సాహంగా పాల్గొన్న సందర్భకులకు సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు కనుదిందు చేశాయి. శుక్రవారం సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా గౌతమి రవిచంద్ర బృందం ప్రదర్శించిన గోదా కళ్యాణం నృత్య ప్రదర్శన సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. దీంతోపాటు పలు ప్రాచీన సాంస్కృతిక ప్రదర్శనలు సందర్శకులను అలరించాయి. శిల్పారామానికి కుటుంబంతో పాటు విచ్చేసిన సందర్శకులు ఎడ్లబండి లో శిల్పారామం అంతా తిరిగి గ్రామీణ వాతావరనాన్ని హైటెక్‌సిటీలో అనుభవించారు.

మహిళా సాధికారత దిశగా రేవంత్ సర్కార్

అఖిలభారత మహిళా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి డాక్టర్ ఎస్తేర్ రాణి

చిక్కడపల్లి, జనవరి 16 (ప్రభాతవార్త) : రాష్ట్రంలో అధికారంలో ఉన్న రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఉన్న కాంగ్రెస్ మహిళా సాధికారత దిశగా ముందుకు సాగుతోందని అఖిలభారత మహిళా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి డాక్టర్ ఎస్తేర్ రాణి అన్నారు. శుక్రవారం చిక్కడపల్లి లో జరిగిన సమావేశంలో ఎస్తేర్ రాణి మాట్లాడుతూ ఇందులో భాగంగా మొత్తం 121సీట్లలో 31 సీట్లు మహిళలకు కేటాయించడం చారిత్రక నిర్ణయమని అన్నారు. ఇది మహిళల రాజకీయ సాధికారత దిశగా తీసుకున్న చారిత్రకమైన మరియు ప్రశంసనీయమైన అడుగు అని అన్నారు. ఈ నిర్ణయం మహిళలపై తెలంగాణ ప్రభుత్వానికి ఉన్న నమ్మకాన్ని, లింగ సమానత్వానికి ఉన్న కట్టుబాటును స్పష్టంగా చూపిస్తుందని, పాలనా వ్యవస్థలో మహిళల భాగస్వామ్యం పెరగడం ప్రజాస్వామ్యాన్ని మరింత బలపరుస్తుందని అన్నారు. ఈ సాహసోపేతమైన మరియు దూరదృష్టితో కూడిన నిర్ణయానికి అందరం అండగా నిలవాలన్నారు. ఈ చర్య మహిళలను రాజకీయాల్లో చురుకుగా పాల్గొనేలా ప్రోత్సహిస్తుందని, సామాజిక న్యాయం, సమతుల్య అభివృద్ధికి దోహదపడుతుందని అన్నారు. దేశవ్యాప్తంగా మహిళలకు మరింత రాజకీయ ప్రాతినిధ్యం కల్పించేందుకు తాము నిరంతరం పోరాడుతూనే ఉంటుందని అన్నారు.

సికింద్రాబాద్ నుంచి తిరుపతికి వెళ్లే ప్రయాణికులకు శుభవార్త

వందేభారత్‌కు పెరిగిన బోగీలు

తార్నాక, జనవరి 16 ప్రభాతవార్త : సికింద్రాబాద్ నుంచి తిరుపతి వెళ్లే ప్రయాణికులకు దక్షిణ మధ్య రైల్వే గుడ్‌న్యూస్ తెలిపింది.సికింద్రాబాద్ నుంచి తిరుపతి మధ్య నడిచే వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు ప్రయాణికుల నుంచి ఆదరణ లభిస్తోంది. ఈ క్రమంలో వందే భారత్ రైలు టికెట్లకు డిమాండ్ నెలకొంది. ప్రయాణికుల నుంచి భారీగా డిమాండ్ నెలకొన్న నేపథ్యంలో రైల్వే అధికారులు ఈ రైలు భోగీల సంఖ్యను పెంచింది. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. వందేభారత్ బోగీల సంఖ్య పెంపు....ఇదిలా ఉంటే 2023 ఏప్రిల్ 9న సికింద్రాబాద్ నుంచి తిరుపతికి వందేభారత్ సర్వీసును దక్షిణ మధ్య రైల్వే ప్రారంభించింది. వందేభారత్ రైలు ప్రారంభంలో కొన్ని నెలల పాటు 8 బోగీలతో నడిచింది. ప్రయాణికుల నుంచి విపరీతమైన ఆదరణ లభించడంతో బోగీల సంఖ్య డబుల్ చేసింది. అంటే బోగీల సంఖ్య 16కు పెంచింది. తాజాగా వందేభారత్‌కు మరింత డిమాండ్ ఉండటంతో మరో 4 బోగీలను పెంచింది. దీంతో వందేభారత్ ప్రస్తుత రైలు బోగీల సంఖ్య 20కి చేరుకుంది.

పురానాపూల్‌లో తీవ్ర ఉద్రిక్తత

రెండు వర్గాల మధ్య పరస్పర దాడులు.. ఇరువర్గాలపై కేసు నమోదు

సునిశిత బస్తీలలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

చార్మినార్, జనవరి 16, ప్రభాతవార్త : పాతబస్తీ పురానాపూల్ దర్వాజా వద్ద ప్రార్థనా మందిరంలోకి ఒక గుర్తు తెలియని వ్యక్తి ప్రవేశించి ఫ్లెక్సీ, పీవోపి విగ్రహాన్ని పాక్షికంగా ధ్వంసం చేయటం స్థానికంగా తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. పోలీసులు సకాలంలో జోక్యం చేసుకోని ఇరువర్గాలను శాంతింపచేయటంతో పరిస్థితి సద్దుమణిగింది. ఈ విషయంలో పోలీ సుల దర్యాప్తు ముమ్మరంగా సాగుతుంది. వివరాల్లోకి వెళితే...బుధవారం అర్ధరాత్రి సుమారు 11.30 గంటల ప్రాంతంలో ఒక అజ్ఞాత వ్యక్తి ప్రవేశించి, ప్రార్థనా మందిరంలోఉన్న ఒక ఫ్లెక్సీ తోపాటు పీవోపీ విగ్రహాన్ని పాక్షికంగా ధ్వంసం చేశాడు. విషయం తెలుసుకున్న రాజేంద్రనగర్ డీసీపీ, చార్మినార్ జోన్ డీసీపీ కిరణ్‌ప్రభాకర్‌ఖరే, ఇతర పోలీసు అధికారులు హుటాహుటిన సంఘటాన స్థలానికి చేరుకుని పరిస్థితి చేయిదాటిపోకుండా చర్యలు తీసుకున్నారు. ఈ ఘటనపై కామాటిపురా పోలీసులు కేసు నమోదు చేశారు. ఘటనా స్థలంలోని సీసీటీవీ ఫుటేజీతోపాటు ఇతర ఆధారాలను సేకరించారు. దర్యాప్తులో భాగంగా నేరస్థుడికి సంబంధించిన కీలక సమాచారం సేకరించారు.త్వరలో నిందితుడిని అరెస్ట్ చేయడం జరుగుతుందని పోలీసు అధికారులు వెల్లడించారు. అయితే ఈ సంఘటన అనంతరం ఒక వర్గానికి చెందిన 300 మంది ఆ ప్రాంతంలో గుమిగూడి, సమీపంలోని మరొక వర్గానికి చెందిన ప్రార్థనా మందిరాన్ని ధ్వంసం చేశారు. పరిస్థితిని అదుపు చేయడానికి ప్రయత్నించిన పోలీసులపై దాడిచేశారు. ఈ దాడిలో నలుగురు పోలీసు సిబ్బందికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించీ కేసు నమోదైయింది. సీసీటీవీ ఫుటేజీ, వీడియోల ఆధారంగా బాధ్యులను దర్యాప్తు అధికారులు గుర్తించారు. చట్టప్రకారం వారి పై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రార్థనా మందిరం ధ్వంసమయ్యాయని జరుగుతున్న ప్రచారంలో ఏమాత్రం వాస్తవం లేదని స్పష్టం చేశారు. ఇటువంటి అసత్య ప్రచారాలను నమ్మవద్దని పోలీసు ఉన్నతాధికారులు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో పరిస్థితి అదుపులోనే ఉంది. ప్రజలు ఎలాంటి ఆందోళన చెందవద్దని, ఈ ఘటనకు సంబంధించి సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు ప్రచారం చేసేవారిపై, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, గోషామహల్ శాసనసభ్యులు రాజా సింగ్, ఎంపిలు అంజన్‌కుమార్‌యాదవ్, అసదుద్దీన్ ఓవైసీలు సంఘటనస్థలాన్ని పరిశీలించి అధికారులు, స్థానికులతో సంఘటనపై ఆరా తీశారు. ఘటనకు కారణమైన వారిని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని పోలీసులను, పుకార్లు నమ్మవద్దని ప్రజలను కోరారు. కాగా శుక్రవారం కామాటిపుర, హుస్సేన్‌ఆలం పోలీసులు పురానాపూల్, గొల్లకిడికీ, పార్థివాడ, దేవిబాగ్, పురానాపూల్ దర్వాజా ప్రాంతాలలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ మాజిద్, చార్మినార్ ఏసీపీ చంద్రశేఖర్. కామాటిపుర సీఐ భాస్కర్, హుస్సేన్‌ఆలం సీఐ ఆంజనేయులు, పోలీసుసిబ్బంది పాల్గొన్నారు.

భక్తిప్రపత్తులతో వీరభద్రస్వామి రథయాత్ర

చిక్కడపల్లి, జనవరి 16(ప్రభాతవార్త): ఆధ్యాత్మికతకు అస్తిత్వానికి ప్రతీకగా నిలిచే వీరభద్ర స్వామి(వంగర) రథయాత్ర జనసంద్రాన్ని తలపించింది. మాజీ ప్రధాని స్వర్గీయ పీవీ నరసింహారావు పూర్వీకుల కాలం నుంచి వస్తున్న ఈ సంప్రదాయం, భక్తికి వారసత్వానికి వారధిగా నిలిచింది. పీవీ తనయుడు పీవీ ప్రభాకర్‌రావు, పీవీ శరత్‌బాబు, పీవీ మదన్ మోహన్, తెలంగాణ యూత్ జర్నలిస్ట్ ఫెడరేషన్ అధ్యక్షుడు తనుగుల జితేందర్ రావు తదితర కుటుంబ సభ్యుల సమక్షంలో ఈ యాత్ర అత్యంత వైభవంగా సాగింది. తమ కుటుంబ సభ్యురాలు రత్నమ్మకు పురుష సంతానం కోసం వీరభద్ర స్వామికి మొక్కుకుని, పీవీ నరసింహారావును దత్తత తీసుకోవడం వల్లే ఈ వంశం నేడు ఇలా ఉందనేది మా ప్రగాఢ విశ్వాసం. ఆ కృతజ్ఞతతోనే 1925 ప్రాంతంలో ప్రారంభమైన ఈ సంప్రదాయాన్ని నాన్న తన చివరి శ్వాస వరకు గౌరవించారు. ఆయన దేశ ప్రధానిగా ఉన్నా సరే, వంగర రథయాత్ర విశేషాలను అడిగి తెలుసుకునేవారు. ఇప్పుడు ఆ పవిత్ర బాధ్యతను మోసే అవకాశం మాకు దక్కడం పూర్వజన్మ సుకృతం అని పీవీ ప్రభాకర్ రావు అన్నారు. పీవీ గ్లోబల్ ఫౌండేషన్ ఆర్థిక సహకారంతో స్థానిక ప్రముఖులు మొండయ్య, వెంకట్ రెడ్డి, సతీష్ రెడ్డి తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శ్యామగాయత్రీ మ్యూజిక్ అకాడమీ

పదమూడవ వార్షికోత్సవ వేడుకలు

చిక్కడపల్లి, జనవరి 16(ప్రభాతవార్త): శ్యామ గాయత్రీ మ్యూజిక్ అకాడమీ పదమూడవ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించబోతున్నట్లు ఆ సంస్థ అధినేత్రి, ప్రముఖ గాయని చిల్లా శివపార్వతి తెలిపారు. 21న నగరంలోని సురవరం

ఘనంగా మకర సంక్రాంతి

మనూర్, జనవరి 16, ప్రభాతవార్త:

మండల కేంద్రమైన మనూర్‌తో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం సంక్రాంతి పండగ వేడుకలను ఆనందోత్సవాలతో భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. గ్రామాల్లోని ఇండ్ల ముందు ఆడపడుచులు రంగు రంగు ముగ్గులు వేసి వాడలను రంగుల మయంగా మార్చుకున్నారు. యువకులు గాలిపటాలను ఎగరేస్తూ ఆనందోత్సవాలతో పండగను పసందుగా జరుపుకున్నారు.

ఘనంగా సంక్రాంతి వేడుకలు

–ఆకట్టుకున్న ముగ్గులపోటీలు

ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో ముగ్గులపోటీల దృశ్యం

న్యాల్‌కల్, జనవరి 16, ప్రభాతవార్త:

సంక్రాంతి పండగను పురస్కరించుకుని మండల కేంద్రమైన న్యాల్‌కల్‌తో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రజలు వేడుకలను ఉత్సాహ భరితంగా ఘనంగా జరుపుకున్నారు. గ్రామాల్లోని ప్రతి హిందువు ఇంటి ముందు ఇంటి ఆడపడుచులు రంగురంగు ముగ్గులువేయడం, గ్రామాల్లో మహిళలకు ముగ్గులపోటీలు నిర్వహించడంతో గ్రామాలు రంగులమయంగా మారాయి. మండల పరిధిలోని హద్నూర్ గ్రామంలో ప్రతి సంవత్సరం మాదిరిగా గ్రామంలోని హనుమాన్ ఆలయ ఆవరణలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి అందమైన ముగ్గులు వేసిన వారికి బహుమతులు అందచేశారు. గ్రామాల్లో చిన్నా పెద్ద తేడాలేకుండా పతంగులను కేరింతలు కొడుతూ ఎగరేసుకున్నారు. గ్రామాల్లోని ప్రజలు ఉదయం ఆలయాలకు చేరుకుని పూజాకార్యక్రమాలు నిర్వహించి నువ్వులు పంచుకుంటూ పండగ శుభాకాంక్షలు తెలుపుకుని పండగను పసందుగా జరుకున్నారు.

అల్లాదుర్గంలో ఘనంగా సంక్రాంతి వేడుకలు

అల్లాదుర్గం, జనవరి 16, ప్రభాతవార్త:

మండల కేంద్రమైన అల్లాదుర్గంతో పాటు మండల పరిధిలోని గడిపెద్దాపూర్, ముస్లాపూర్, చిల్వర, మాందాపూర్, ముప్పారం, చేవేళ్ల, బహిరన్‌దిబ్బ, అప్పాజీట్టి, రెడ్డిపల్లి, వెంకట్‌రావుఉపేట, కాయిదంపల్లి తదితర గ్రామాల్లో గురువారం సంక్రాంతి పండగను ప్రజలు ఆనందోత్సవాలతో భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. తెలుగు సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సంక్రాంతి పర్వదినంను ప్రతి ఒక్కరు జరుపుకున్నారు. మహిళలు తమ ఇండ్ల ముందు రంగు రంగు ముగ్గలు వేసి సంబరంగా పండగను జరుపుకున్నారు. యువకులు గాలిపటాలను, మహిళలు మగ్గలు వేసి పండగను పసందుగా జరుపుకున్నారు. పండగను పురష్కరరించుకుని నువ్వులను పంచుకుంటూ పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పండగను పురష్కరించుకుని మెదక్ జిల్లా బిజెపి కార్యవర్గ సభ్యులు కాలరాములు పండగ శుభాకాంక్షలు తెలిపారు.

హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

–అందోలు మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరన్

జోగిపేట, జనవరి 16, ప్రభాతవార్త:

సంక్రాంతి సంబరాల్లో ఇండ్ల ముందు మహిళలు వేసిన రంగవల్లుల్ని తిలకించటంతోపాటు, పతంగులను ఎగురవేస్తూ అందోలు మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరన్, డిసిసిబి మాజీ జిల్లా ఉపాధ్యక్షులు పి.జైపాల్‌రెడ్డిలు జోగిపేట పట్టణంలో శుక్రవారంనాడు హడావుడి చేశారు. పట్టణంలోని పలు వార్డులలో బిఆర్ఎస్ నాయకులతో కలిసి తిరుగుతూ మహిళలు వేసిన ముగ్గులను పరిశీలించి వారితో ముచ్చటించారు. కేసీఆర్ హయాంలో రాష్ట్రంలో ఏ ఇబ్బందులు లేకుండా ఉండేదని, కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి లేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చటంతో విఫలమైందన్నారు. రాబోయేది మళ్లీ బిఆర్ఎస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. కాగా ముగ్గుల పోటీల్లో విజేతలకు ఆయన బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు పట్లూరి శివశేఖర్, డి.బి.నాగభూషణం, సార శ్రీధర్, బీర్ల శంకర్, హెచ్.రామాగౌడ్, ప్రదీప్‌గౌడ్, జిన్నా విజయ్‌కుమార్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల పట్ల మక్కువ కనపరచాలి

–అంబేద్కర్ సంఘం జిల్లా నాయకుడు తుడుం శ్రీనివాస్

గుమ్మడిదల, జనవరి 16, ప్రభాతవార్త:

సంక్రాంతి పండుగను పురస్కరించుకొని కానుకుంట గ్రామంలో నిర్వహిస్తున్న వాలీబాల్ టోర్నమెంట్‌కు గుమ్మడిదల గ్రామానికి చెందిన యువ నాయకుడు అంబేద్కర్ సంఘం జిల్లా నాయకుడు తుడుం శ్రీనివాస్ ఆర్థిక సహకారంతో వాలీబాల్ కిట్టును కానుకుంట గ్రామ యువకులకు అందజేశారు. కార్యక్రమంలో గుమ్మడిదల మాజీ సర్పంచ్ తులసీదాసు, ఆకుల ఆంజనేయులు, రాయ్ కరుణాకర్ రెడ్డి, సరెడ్డిగారి కర్ణాకర్ రెడ్డి, బొడ్డు రాజమోళి, మల్లెపల్లి ప్రకాష్, షేక్ ఖాజా, దాచారం సాయి తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

అయ్యప్పస్వామి ఆలయ కమిటీ చైర్మన్‌కు సన్మానం

నర్సాపూర్, జనవరి 16, ప్రభాతవార్త:

నర్సాపూర్ పట్టణంలోని శ్రీఆదిపరాశక్తి వనధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయాన్ని నూతనంగా అయ్యప్ప ఆలయ కమిటీ చైర్మన్ దుర్గాప్పగారి అశోక్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్మించారు. అయ్యప్పస్వామి విగ్రహప్రతిష్ఠ మహోత్సవాలు అయ్యప్ప ఆలయ కమిటీ చైర్మన్ అశోక్‌గౌడ్ ఆధ్వర్యంలో కనీవినీ ఎరుగని రీతిలో వైభవోపేతంగా అరుణ్ గురుస్వామి చేతులమీదుగా అయ్యప్పస్వామి తదితర దేవతల విగ్రహప్రతిష్ఠ మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. అయ్యప్పస్వామి ఆలయనిర్మాణానికి ఎంతో కృషిచేసిన అయ్యప్పస్వామి ఆలయకమిటీ చైర్మన్ అశోక్‌గౌడ్ గురుస్వామికి, నర్సాపూర్‌కు చెందిన పలువురు అయ్యప్పస్వామి దీక్షస్వాములను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు పాపగారి పెద్ద రమేశ్‌గౌడ్, రెడ్డిపల్లి రవిందర్‌గౌడ్, చిప్పల్‌తుర్తి లక్ష్మణ్‌గౌడ్, నాగరాజు, కుమకమరి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో క్రీడాపోటీలు అభినందనీయం

విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఉదయ్‌కుమార్, ఎల్లం

నర్సాపూర్, జనవరి 16, ప్రభాతవార్త:

గ్రామీణ ప్రాంతంలో క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమని నత్నాయపల్లి గ్రామ సర్పంచ్ అందూరు ఉదయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం నత్నాపపల్లి గ్రామంలో గానుగ రవి స్మారక క్రికెట్ టోర్నమెంటును ఈనెల 13 నుంచి 16 వరకు నిర్వహించారు. ఈ క్రికెట్ టోరంనమెంట్‌లో విజేతలకు గ్రామసర్పంచ్ ఉదయ్‌కుమార్‌తోపాటు ఉపసర్పంచ్ ఎల్లంల చేతులమీదుగా నగదుతో పాటు బహుమతులను అందజేశారు. ఈ క్రికెట్ టోర్నమెంట్లో 12 టీంలు పాల్గొనగా విజేతలుగా రవి చాలెంజర్స్ టీం విన్నర్‌గా హనుమాన్ టీం రన్నర్‌గా నిలిచింది. విన్నర్ జట్టుకు 7 నగదు ప్రశంస పత్రం అందజేయగా రన్నర్ గా నిలిచిన జట్టుకు 3 వేల నగదు ప్రశంసా పత్రాలను అందజేశారు. అదేవిధంగా మ్యాన్ ఆఫ్ ది సిరీస్ బెస్ట్ బౌలర్ బెస్ట్ బ్యాట్స్మెన్ బెస్ట్ స్కోరర్ తదితరులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అందూరి ఉదయ్ కుమార్, ఉప సర్పంచ్ ఎల్లం, ఫీల్డ్ అసిస్టెంట్ గున్నాల పోచన్న, దర్శన్, మహేశ్వర్, ఈశ్వర్, శేఖర్, శివులు, సిద్దు, కార్తీక్, ప్రశాంత్, సూర్య బాలాజీ, ప్రసాద్ కుమార్ క్రీడాకారులు పాల్గొన్నారు.

ఓట్లు అడిగే కాంగ్రెస్ నాయకులను నిలదీయండి

–ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

నర్సాపూర్, జనవరి 16, ప్రభాతవార్త:

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి విమర్శించారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 25 నెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీల్లో ఒక్క హామీని కూడా సంపూర్ణంగా అమలుచేయక నెరవేర్చలేదని ఎమ్మెల్యే ధ్వజమెత్తారు. శుక్రవారం నర్సాపూర్ పట్టణ కేంద్రంలో ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో 6 గ్యారెంటీల బకాయి కార్డులను పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులతో కలిసి ఆమె ఇంటింటికీ తిరుగుతూ, ప్రభుత్వం ఏయే పథకాల్లో ఎంత మొత్తం 6 గ్యారంటీల హామీలో ఎ్త బాకీ ఉందో వివరిస్తూ రూపొందించిన కార్డులను ప్రజలకు పంపిణీ చేస్తు ప్రచారం చేశారు. హామీలు అమలు చేయకుండా మళ్లీ ఓట్లు అడిగేందుకు వచ్చే కాంగ్రెస్ నాయకులను ప్రజలు నిలదీయాలని ఆమె పిలుపునిచ్చారు. ప్రభుత్వం విఫలమైన తీరుపై ప్రజల్లో చైతన్యం కల్పిస్తున్నామని, బాకీ ఉన్న ప్రతి పైసాను ప్రభుత్వం తక్షణమే చెల్లించాలన్నారు. రానునంన మున్సిఫలన ఎన్నికల్లో నర్సాపూర్ లో బిఆర్ఎస్ పార్టీ జెండాను ఎగుర వేస్తామన్నా ధీమాను ఎమ్మెల్యే సునీతారెడ్డి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సింగాయిపల్లి గోపి, సీనియర్ నాయకులు సత్యం గౌడ్, పట్టణ అధ్యక్షుడు పంబల బిక్షపతి, నాయకులు బాల్ రెడ్డి, రింగుల ప్రసాద్, షేక్ హుస్సేన్, ఆనంద్ కుమార్, ఆంజనేయులు గౌడ్, నాగేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



హామీల బకాయి కార్డులతో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి, బిఆర్ఎస్ నాయకులు

సంక్రాంతి సందర్భంగా సత్యనారాయణ స్వామి నోములు

హుస్నాబాద్ రూరల్ (కోహెడ), జనవరి 16, ప్రభాతవార్త:

నియోజకవర్గంలోని కోహెడ మండలం సముద్రాల గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మొట్టమొదటిసారిగా 13 సత్యనారాయణ స్వామి పీఠలతో నోములను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రిటైర్డ్ డీజీపీ కార్యాలయ అధికారి గాండ్ల రాజేశ్వర్, సరస్వతి దంపతులు అంగరంగ వైభవంగా ఈ పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో ఎన్నడూ లేని విధంగా 13 సత్యనారాయణస్వామి పీఠలతో నోములు నిర్వహించడం విశేషంగా నిలిచింది. కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో మోతుకూరి శ్రీనివాస్ శర్మ, రవి కుమార్ జ్యోతి దంపతులుతో పాటు తదితరులు ఉన్నారు.

హత్నూర మండలంలో ఘనంగా సంక్రాంతి

హత్నూర, జనవరి 16, ప్రభాతవార్త:

హత్నూర మండలవ్యాప్తంగా మకర సంక్రాంతి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. పల్లెసంస్కృతిని ప్రతిబింబిస్తూ ప్రజలు భక్తిశ్రద్ధలతో, ఉత్సాహంతో ఈ పెద్ద పండుగను జరుపుకున్నారు. మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. ఇంటి ముంగిట రంగవల్లులు గొబ్బెమ్మలు మండలంలోని ప్రతి ఇల్లూ కొత్తశోభను సంతరించుకుంది. ఆయా గ్రామాలలో కబట్టి, క్రికెట్ పోటీలను నిర్వహించి ఉత్సాహంగా జరుపుకున్నారు.

క్రీడా పోటీలతో సంక్రాంతి సంబురాలు

–అలరించిన రంగవల్లులు

చౌటకూరు, జనవరి 16, ప్రభాతవార్త:

ఉమ్మడి పుల్‌కల్ మండలంలోని ఆయా గ్రామాల్లో సంక్రాంతి సంబురాలు అంబరాన్నంటాయి. రంగు రంగు ముగ్గులు వేసి వాడలను రంగుల మయంగా మార్చారు. మకర సంక్రాంతి పండగను పురస్కరించుకుని మండల పరిధిలోని సరాఫ్‌పల్లిలో ముగ్గుల పోటీలు, గంగోజిపేట, గొంగ్లూర్, సింగూరు తదితర గ్రామాల్లో క్రికెట్ పోటీలు నిర్వహించారు. సరాఫ్‌పల్లిలో మహిళలు ఇందిరమ్మ చీరలు ధరించి ముగ్గుల పోటీల్లో పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ముగ్గుల, క్రికెట్ పోటీల్లో ప్రతిభ చాటిన వారికి బిజెపి నాయకులు చంటి ప్రభు, సర్పంచ్ రామచంద్రారెడ్డి, సర్పంచ్‌లు కమ్మరి నవనీత అశోక్, యాదగిరి, నందికంటి శ్రీనివాస్ ముదిరాజ్‌లు నగదు బహుమతులు, ట్రోఫీలను అందచేశారు.

ఝరాసంగంలో విద్యుత్ స్తంభాలకు ఎల్ఈడి బల్బులు

ఝరాసంగం, జనవరి 16, ప్రభాతవార్త:

మండల కేంద్రమైన ఝరాసంగంలోని ఆయా వాడల్లోన విద్యుత్ స్తంభాలకు గ్రామసర్పంచ్ వినోదబాలరాజ్, ఉపసర్పంచ్ మమతఅనిల్‌కుమార్‌పాటిల్‌లు దగ్గరుండి ఎల్ఈడి విద్యుత్‌దీపాలను బిగింపచేయించారు. విద్యుత్‌స్తంభాలకు ఎల్ఈడి బల్బులు అమర్చడంతో గ్రామప్రజలు సంతోషం వ్యక్తంచేస్తూ పంచాయతీసర్పంచ్, ఉపసర్పంచ్, వార్డుసభ్యులను అభినందించారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం

కొమురవెల్లి, జనవరి 16, ప్రభాతవార్త:

రాష్ట్ర రోడ్లు భవనాలుశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి భువనగిరి పార్లమెంట్ సభ్యులు ఉన్న సమయంలో శ్రీమల్లికార్జునస్వామి దేవాలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం తన ఎంపి లాడ్స్ నిధుల ద్వారా వాటర్ ప్లాంట్ మంజూరు చేశారు. గత కొన్ని రోజులుగా టెక్నికల్ ప్రాబ్లమ్స్ వలన వాటర్ ప్లాంట్ ప్రజలకు అందుబాటులోకి రాలేదు. దీంతో దేవాలయం నుంచి మరమ్మత్తులు చేయించి భక్తులకు, ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. ఈ సందర్భంగా శుక్రవారం దేవస్థాన పాలకమండలి, మండల కాంగ్రెస్‌పార్టీ పక్షాన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

చక్రియాలలో ముగిసిన క్రికెట్ టోర్నీ

చక్రియాలలో క్రికెట్ టోర్నీ విజేత జట్టుకు ట్రోఫిని అందచేస్తున్న దృశ్యం

చౌటకూరు, జనవరి 16, ప్రభాతవార్త:

సంక్రాంతి పండగను పురస్కరించుకుని మండల పరిధిలోని చక్రియాలలో గురువారం నిర్వహించిన చక్రియాల ప్రీమియర్ లీగ్ క్రికెట్ టౌర్నమెంట్‌ను కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజశేఖర్ ప్రారంభించారు. క్రికెట్ టోర్నీ ప్రారంభానికి ముందు ఇటీవల గుండెపోటుతో కానరాని లోకాలకు చేరిపోయిన మాజీ సర్పంచ్ బి కిష్టారెడ్డికి ఘనంగా నివాళులు అర్పించారు. క్రీడలను క్రీడా స్ఫూర్తితో ఆడాలని, క్రీడల్లో గెలుపు ఓటములు నాణేనికి చిత్తుబొత్తులాగా ఉంటాయని సర్పంచ్ అనసూజ రాజశేఖర్ అన్నారు. క్రీడల్లో ప్రతిభ చాటిన క్రీడా జట్టుకు, క్రీడాకారులకు బహుమతులు అందచేశారు.

కేంద్రం ప్రజావ్యతరేక చట్టాలను రద్దుచేయాలి

సిఐటియు జిల్లా నాయకుడు ఎల్లయ్య డిమాండ్

కొండపాక, జనవరి 16, ప్రభాతవార్త:

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తెచ్చిన కార్మిక, వ్యవసాయ, రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేసే వరకు పోరాడాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు సందే బోయిన ఎల్లయ్య ప్రజలకు పిలుపు నిచ్చారు. శుక్రవారం కుకునూరుపల్లి, కొండపాక దుద్దెడ గ్రామాల్లో నిర్వహిచిన కార్మిక, కర్షక పోరుబాట జీపు జాతాను ఉద్దేశించి అయన మాట్లాడారు. కేంద్రం తీసుకొచ్చిన ప్రజావ్యతిరేక చట్టాలను రద్దుచేయాలంటూ ఈనెల 19న సిద్దిపేట జిల్లానకేంద్రంలో నిర్వహించే భారీర్యాలీని జయప్రదంచేయాలని కోరారు. అదేవిధంగా ఫిబ్రవరి 12న కార్మకసంఘాలు, రైతుసంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్త సమ్మె చేపట్టనున్నట్లు ఆయన వివరించారు.

దళితుల హక్కులను కాలరాస్తున్న కాంగ్రెస్

–ప్రభుత్వం తీరుపై ఎమ్మెల్యే ఆగ్రహం

జహీరాబాద్, జనవరి 16, ప్రభాతవార్త:

రాజ్యాంగ పరంగా దళితుల హక్కులను కాంగ్రెస్ ప్రభుత్వం కాలరాస్తోందని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు విమర్శించారు. జహీరాబాద్ మున్సిపాలిటీకి జరుగబోయే ఎన్నికలల్లో 37 వార్డులకు గాను ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ విడుదల చేసిన రిజర్వేషన్ల కేటాయింపులో షెడ్యూల్ క్యాస్ట్, షెడ్యూల్ ట్రైబల్ వర్గానికి కేటాయింపులో తీవ్ర అన్యాయం చోటుచేసుకుందన్నారు. ప్రజా ప్రభుత్వం అని చెప్పుకునే కాంగ్రెస్ సర్కార్ దళితుల గొంతు అణిచి వేస్తోందని ఆందోళన వ్యక్తంచేశారు.

కలివేముల జాతరలో ఎమ్మెల్యే చింత ప్రభాకర్

–ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

కంది, జనవరి 16, ప్రభాతవార్త:

మండలపరిధిలోని కలివేములగ్రామంలో కొలువుండి భక్తులచే నిత్యపూజ లందుకుంటున్న వెంకటలక్ష్మమ్మ, భూలక్ష్మి ఆలయ జాతర మహోత్సవాల్లో ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పాల్గొని ఆలయంలో అర్చకులు వేద మంత్రాలు వల్లిస్తుండగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ పూలన్నగారరి పవిత్ర మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో కొనసాగుతున్న జతర ఉత్సవాలకు హాజరైన ఎమ్మెల్యేను ఆలయ కమిటి బాధ్యులు, సర్పంచ్ ఘనంగా సన్మానించి తీర్థ ప్రసాదాలు అందచేశారు. కార్యక్రమంలో మాజీ సిడిసి చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, విజేందర్‌రెడ్డి, ట్టణ అధ్యక్షులు ఆర్ వెంకటేశ్వర్లు, కార్యదరర్శి నర్సింలు, మాజీ జడ్పీటిసి సభ్యులు కొండల్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొనగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అందరికి సంక్రాంతి పండగ శుభాకాంక్షలు తెలిపారు.

రోడ్డు భద్రత ప్రతీ డ్రైవర్ బాధ్యత

–హుస్నాబాద్ సిఐ కోండ్ర శ్రీనివాస్

హుస్నాబాద్ రూరల్, జనవరి 16, ప్రభాతవార్త:

రోడ్డు భద్రత అనేది ప్రతీ డ్రైవర్ బాధ్యత అని హుస్నాబాద్ సీఐ కోండ్ర శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం రోజున పట్టణంలోని ఆర్టీసీ బస్ డిపోలోని బస్సు డ్రైవర్‌లకు సజీవంగా చేరుకోండి అనే నినాదంతో రోడ్డు సేఫ్టీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీసీ అనేది పెద్ద సంస్థ అని ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చేందుకు డ్రైవర్లు పడుతున్న కష్టం తక్కువ కాదన్నారు. ప్రతీ డ్రైవర్ కూడా కచ్చితంగా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రయాణికులకు క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చడంతో పాటు రోడ్డు ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో హుస్నాబాద్ ఎస్ఐ పాకాల లక్ష్మారెడ్డి, ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాస్, డిపో మేనేజర్ వెంకన్నతో పాటు డిపో సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడల మానసికోల్లాసానికి దోహదం చేస్తాయి

–ఎస్ఐ రవికాంత్‌రావు

విజేతలకు కప్ అందిస్తున్న ఎస్ఐ రవికాంత్‌రావు

తొగుట, జనవరి 16, ప్రభాతవార్త:

క్రీడల మానసికోల్లాసానికి ఎంతగానో దోహదం చేస్తాయని ఎస్ఐ రవికాంత్ రావు అన్నారు. మండల పరిధిలోని ఎల్లారెడ్డిపేట గ్రామంలో మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ దేవునూరి పోచయ్య, మజ్జు ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రధానం చేసి మాట్లాడారు.ఆటలలో గెలుపోటములు సహజమని క్రీడా స్ఫూర్తితో యువత ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ఆర్గనైజర్లు నాగిళ్ల ప్రవీణ్‌రెడ్డి, యాటా చందు, నందారం మహేష్, గావురోల సాయి, కనికి ప్రవీణ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బైతి స్వామి, బుర్ర నర్సింలు, ప్రవీణ్‌రెడ్డి, గ్రామ యువకులు, పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచి పదవి.. మరువని కులవృత్తి..

–బేగరి వృత్తిలో భాగంగా బొంద తవ్వుతున్న శ్రీనివాస్

పాపన్నపేట, జనవరి 16, ప్రభాతవార్త:

ఈ రోజుల్లో రాజకీయ పదవులు ..రాచరికాన్ని తలపిస్తున్నాయి.కొంత మంది గద్దె ఎక్కగానే హోదాకోసం ప్రాకులాడుతున్నారు. మూలాలు మరిచి, పదవుల ప్రపంచంలో మునిగి తేలుతున్నారు. కానీ పావన్నపేట మండలం అర్కెల గ్రామానికి చెందిన బేగరి శ్రీనివాస్ ఇటీవల జరిగిన ఎన్నికల్లో సర్పంచ్ ఎన్నికయ్యారు. శుక్రవారం గ్రామానికి చెందిన కుమ్మరి అంజమ్మ చని పోయింది.దీంతో తన కులవృత్తిలో భాగంగా..సర్పంచ్ అనే పదవిని మరిచిన శ్రీనివాస్, అధికార హోదాను వక్కన బెట్టి, బొందను తవ్వాడు. ఇది చూసిన గ్రామస్థులు సర్పంచిని పొగిడారు.

రామాయంపేట అభివృద్ధిని పట్టించుకోని నాయకులు

–బిజెపి జిల్లా అధ్యక్షుడు జిల్లా అధ్యక్షులు మల్లేష్‌గౌడ్

రామాయంపేట, జనవరి 16, ప్రభాతవార్త:

10 సంవత్సరాలు పాలించిన బీఆర్ఎస్ పార్టీ, రెండు సంవత్సరాలగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ రామాయంపేట అభివృద్ధిని మాత్రం పట్టించుకోవడంలేదని బిజెపి నాయకులు విమర్శించారు. రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని బిజెపి కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు వాల్దాస్ మల్లేష్‌గౌడ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు మీడియా సమావేశం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ అవినీతిపై ఎంపీ రఘునందన్‌రావుకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు, మండల అధ్యక్షులు నవీన్ గౌడ్, సీనియర్ నాయకులు సిద్ధిరాములు, అక్కన్నపేట్ సర్పంచ్ యాదగిరి, పట్టణ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌రాజ్, దళిత మోర్చా నిమ్మల స్వామి, పట్టణ మహిళామోర్చా లావణ్య, యువమోర్చా కన్నయ్య, కార్తీక్ పాల్గొన్నారు.

తప్పుడు ఆరోపణలు సరికాదు

–వహీద్ తహేర్

నారాయణఖేడ్, జనవరి 16 ప్రభాతవార్త:

అభివృద్ధిని ఓర్వలేక మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదని కాంగ్రెస్ పార్టీ ఖేడ్ మండల అధ్యక్షులు వహీద్ తహేర్ అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మైనార్టీ స్మశానవాటిక అభివృద్ధికోసం జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్‌షెట్కార్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి కలిసి భూమిపూజ నిర్వహించారని తెలిపారు. కార్యక్రమంలో మైనార్టీలు మైనోద్దీన్ ఖురేషి, సుబూర్, రషీద్, అజీమ్, యూసుఫ్, సుమాన్, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న కేంద్రం

–వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి శశిధర్

జగదేవ్‌పూర్, జనవరి 16, ప్రభాతవార్త:

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి శశిధర్ అన్నారు. కార్మిక కర్షక పోరుబాట జీపు జాత శుక్రవారం జగదేవ్‌పూర్‌కు చేరుకుంది. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య, రైతుసంఘం జిల్లా కార్యదర్శి వెంకట్, నాయకులు రంగారెడ్డి, యాదగిరి, రాజు, నర్సింలు, స్వామి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి సందర్భంగా దేవస్థానంలో నందీశ్వర సేవ

–చైర్మన్ మద్ది ప్రతాపరెడ్డి

గుమ్మడిదల, జనవరి 16, ప్రభాతవార్త:

మకర సంక్రాంతి పండుగను పురస్కరించుకొని స్థానిక దేవస్థానంలో నందీశ్వర సేవ కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని దేవస్థానం పాలకమండలి చైర్మన్ ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించగా, ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. నందీశ్వర సేవలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పర్యవేక్షకులు సోమయ్య ఆధ్వర్యంలో నిర్వహణ ఏర్పాట్లు చక్కగా సాగాయి. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో దర్శనాలు సులభంగా జరిగాయి. నందీశ్వరునికి పుష్పాలంకరణ, నైవేద్యాలు సమర్పించి ప్రత్యేకహారతి నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు మాట్లాడుతూ, మకర సంక్రాంతి పండుగను నందీశ్వర సేవతో ప్రారంభించుకోవడం ఎంతో శుభప్రదమని, గ్రామంలో సుఖశాంతులు, సమృద్ధి కలగాలని ప్రార్థించినట్లు తెలిపారు. కార్యక్రమం భక్తిమయ వాతావరణంలో ప్రశాంతంగా, విజయవంతంగా ముగిసింది.ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు అశోక్ గౌడ్, భాస్కర్ గౌడ్, యాదగిరి గౌడ్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డి జిల్లాలో సంక్రాంతి సంబరాలు

సంగారెడ్డి బ్యూరో, జనవరి 16, ప్రభాతవార్త:

జిల్లావ్యాప్తంగా మకర సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు పల్లెటూరి వాతావరణం ఉట్టిపడేలా ప్రజలు ఈపండుగను అత్యంత వైభవంగా జరుపు

మంజీరానదీతీరంలో 18న మాఘ స్నానాలు

-సంగమేశ్వరస్వామి ఉత్సవాలు

మనూర్, జనవరి 16, ప్రభాతవార్త:

మండలపరిధిలోని మంజీరానదీతీరం బోరంచగ్రామ శివారులో కొలువైవున్న అతిపురాతనమైన శ్రీసంగమేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 18న అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని మాఘస్నానాలు, సంగమేశ్వర స్వామి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు వేద స్మార్త పండితులు గురురాజు శర్మ తెలిపారు. అనాదిగా వస్తున్న ఆచారం మేరకు ఉత్సవాలను ఉత్సాహ భరితంగా జరపుకునేందుకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు వివరించారు. 17న సాయంత్రం గంగాహారతి, 18న ఉదయం సుప్రభాతసేవ, రుద్రాభిషేకం, మాఘస్నానాలు, రుద్రహోమం పూజాకార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. వేడుకలకు ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి హాజరై మాఘ స్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకోనున్నట్లు పండితులు గురు రాజు శర్మ వివరించారు.

సర్వరోగ నివారిణికి వైరస్ ముప్పు

-న్యాల్‌కల్‌లో వైరస్‌తో ఎండుకుపోతున్న వేపచెట్టు

వైరస్‌తో ఎండుకుపోతున్న వేపచెట్టు దృశ్యం

న్యాల్‌కల్, జనవరి 16, ప్రభాతవార్త:

పవిత్రతకు మారుపేరుగా, ఔషధ గుణాలు కలిగిన సర్వరోగ నివారిణిగా పేరున్న వేపచెట్టు వైరస్ ప్రభావంతో ఎండుకుపోతోంది. ఇన్నాళ్లు మనుషులే వైరస్‌కు గురై నిందు ప్రాణాలను కోల్పోతుండటం చూస్తూ, వింటూ వచ్చాం. నేడు వైరస్ ప్రభావం మనుషులపైనే కాకుండా పలు రోగాలకు నివారిణిగా ఉన్న వేపచెట్టు వైరస్ ప్రభావంతో మండలకేంద్రమైన న్యాల్‌కల్ గ్రామ శివారులో ఎండుకుపోతోంది. వేపచెట్టు భాగాలు అన్నీ ఔషధ గుణాలు కల్గినవని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. పలురోగాల నివారణకు వేపచెట్టును ఉపయోగిస్తూ ఉంటారు. సర్వరోగ నివారిణిగా ఉన్న వేపచెట్టుకే వైరస్ సోకిందంటే వాతావరణ పరిస్థితులు ఎలా మారిపోతున్నాయో అని ప్రజలు భయపడుతూ ఉన్నారు.

మాయికోడ్‌లో బసవేశ్వర జెండా ఆవిష్కరణ

మాయికోడ్‌లో బసవేశ్వర జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం

మనూర్, జనవరి 16, ప్రభాతవార్త:

మండలపరిధిలోని మాయికోడ్‌లోని చౌరస్తాలో గురువారం విశ్వగురువు మహాత్మా బసవేశ్వరుడి విగ్రహానికి పూజాకార్యక్రమాలు నిర్వహించి జెండా ఆవిష్కరణ చేశారు. సంక్రాంతిపండగ రోజును బసవేశ్వరుడి విగ్రహం వద్ద జెండా ఆవిష్కరణచేయడం గ్రామంలో ఆనవాయితీగా వస్తోంది. దీనిలో భాగంగా గురువారం ఇటీవల గ్రామసర్పంచిగా ఎన్నికైన కర్ణం కృష్ణను శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో శేరి సంగన్న, సంగయ్యస్వామి, మంత్రి బస్వరాజ్, పోచారం సంగన్న, గాండ్ల రాజ్‌కుమార్, గాండ్ల సుధాకర్, శరణప్ప, రాజ్‌కుమార్, గణపతి, మంత్రి ఆనంత్, కర్ణం ఈశ్వరప్ప తదితరులు పాల్గొన్నారు.

కోతులను పట్టడం నిరంతర ప్రక్రియ

-సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి

కోతుల కోసం ఏర్పాటుచేసిన జాలీ కంచెలు

గుమ్మడిదల, జనవరి 16, ప్రభాతవార్త:

గుమ్మడిదల ప్రాంతంలో కోతులవల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలోపెట్టుకుని, కోతులనుపట్టే కార్యక్రమం నిరంతరంగా కొనసాగుతుందని సిజిఆర్‌ట్రస్ట్ చైర్మన్, బిఆర్ఎస్‌నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి తెలిపారు. ఈకార్యక్రమం తాత్కాలికం కాదని, ప్రజలకు పూర్తిస్థాయి ఉపశమనం కలిగేవరకు కొనసాగుతుందని ఆయన స్పష్టంచేశారు. ఇప్పటి వరకు గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలో సుమారు 500కోతులను విజయవంతంగా పట్టడం జరిగింది అని ఆయన తెలిపారు. గుమ్మడిదల పరిధిలో లేదా పరిసరప్రాంతాల్లో ఎక్కడైనా కోతులుకనిపిస్తే వెంటనే సిజిఆర్ ట్రస్ట్ క్యాంపు కార్యాలయంలో సమాచారం అందించాలని ప్రజలను కోరారు. అందిన సమాచారం మేరకు తక్షణమే చర్యలుతీసుకుంటామని హామీ ఇచ్చారు.

గౌడసంఘం అధ్యక్షునిగా తిరుపతి

నూతన పాలకవర్గాన్ని సత్కరిస్తున్న దృశ్యం

కోహెడ, జనవరి 16, ప్రభాతవార్త:

మండలంలోని సముద్రాల గ్రామంలో గౌడసంఘం నాయకులు శుక్రవారం ఎల్లమ్మతల్లి దేవాలయం వద్ద సమావేశమయ్యారు. ఈసందర్భంగా శ్రీరేణుకామాత యువజన సంఘాన్ని ఏర్పాటుచేసుకుని నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పంతంగి తిరుపతిగౌడ్, ఉపాధ్యక్షులు గట్టు రమేష్‌గౌడ్, కార్యదర్శి పరకాల సతీష్‌గౌడ్, కోశాధికారి వంగ హరీష్‌గౌడ్‌లను ఎన్నుకున్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన పాలకవర్గాన్ని శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. నూతనంగా ఏర్పాటైన సంఘం ఆధ్వర్యంలో సముద్రాలలోని ఎల్లమ్మ దేవాలయ అభివృద్ధితోపాటు గౌడకుల అభివృద్ధికి పాటుపడతామన్నారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులతోపాటు తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ హయాంలో 19వ వార్డుకు నిధులు

-మాజీ కౌన్సిలర్ పట్లూరి నాగరాజుగౌడ్

సదాశివపేట, జనవరి 16, ప్రభాతవార్త:

సదాశివపేట పట్టణంలోని 19వ వార్డు అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం గణనీయమైన నిధులు కేటాయించిందని వార్డ్ మాజీ కౌన్సిలర్ పట్లూరి నాగరాజుగౌడ్ తెలిపారు. కాంగ్రెస్‌ప్రభుత్వం తమవార్డుకు టియుఎఫ్ఐడిసి నిధుల కింద మొత్తం రూ.1.70కోట్లను మంజూరు చేసినందుకు టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, టిజిఐఐసి కార్పొరేషన్‌చైర్మన్ నిర్మల జయప్రకాశ్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

అంగరంగ వైభవంగా శివపార్వతుల కళ్యాణం

-ఘనంగా మూడురోజులు సాగిన బ్రహ్మోత్సవాలు

-మారుమోగిన శివనామస్మరణ

కొండపాక, జనవరి 16, ప్రభాతవార్త:

సంక్రాంత పర్వదినం సందర్భంగా దుద్దెడ గ్రామంలోని స్వయంభూశంభుదేవాలయం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడురోజులపాటు శివనామ స్మరణతో గ్రామంమొత్తం మారుమోగింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం భవానీసమేత శంభుదేవుని కళ్యాణమహోత్సవం అంగరంగవైభవంగా నిర్వహించారు. మొదటగా మండపంలో వేదమంత్రోచ్చారణలతో హోమంనిర్వహించి స్వామి వారి ఎదుర్కోలు కార్యక్రమం చేపట్టారు. స్వామి వారి కళ్యాణానికి కొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవస్థానం తరపున మొదటిసారిగా ప్రధాన అర్చకుడు మహాదేవుని మలికార్జున్ పంతులు పట్టు వస్త్రాలను శంభుదేవుడు భవానీమాతకు సమర్పించారు. మహిళలు పెద్దసంఖ్యలో హాజరై స్వామి వారికి ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. కళ్యాణకర్తలుగా చంద్రగిరి శ్రీనివాస్, మంచాల శ్రీనివాస్ దంపతులు పాల్గొన్నారు. శంభు లింగేశ్వరస్వామి సేవాసమితి ఆధ్వర్యంలో పలువురు దాతలకు, ప్రముఖులకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలను రాత్రి గ్రామంలోని ప్రధాన వీధులగుండా ఊరేగిస్తూ, ఘనంగా రథోత్సవం నిర్వహించారు. శివపార్వతుల ఎదుర్కోలు కార్యక్రమంలో విద్యార్థులు కోలాటం, నృత్యప్రదర్శనలు చేసారు. రాత్రి జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చెందిన సమ్మక్క సారలమ్మ భాగవతకళాకారుల బృందంచే గోవింద మహారాజులు భాగవతకార్యక్రమం నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా దేవాలయం ట్రస్ట్‌సభ్యులు అన్నిరకాల ఏర్పాట్లుచేశారు. కార్యక్రమంలో సర్పంచి మిద్దె శివకుమార్, ట్రస్ట్ అధ్యక్షుడు మంచాల శ్రీనివాస్, ప్రధానకార్యదర్శి పెద్దంకుల శ్రీనివాస్‌గౌడ్, కోశాధికారి వడ్లకొండ శ్రీనివాస్, సభ్యులు అనంతుల నరేందర్, గొనె శ్రీనివాస్, మంచాల చిన్న శ్రీనివాస్, దేశాయ్‌రెడ్డి, నూనెకుమార్, మంచాల కృష్ణ మూర్తి, పెద్ది కుమార్‌స్వామి, పెద్ది శ్రీనివాస్, పబ్బోజు శ్రీనివాస్‌చారి, బింగి బాస్కర్, వడ్లకొండ అనిల్, తాళ్ల రవీందర్, వెంకటేశం, ఎల్లం, పిల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



శివపార్వతుల కళ్యాణోత్సం నిర్వహిస్తున్న వేదపండితులు

గాలిపటాల వెనుక సైన్స్ దాగి ఉంది

-మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు

గాలి పటం ఎగురవేస్తున్న హరీష్‌రావు

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:

సంక్రాంతి పండుగపూట ఎగురవేసే గాలిపటాల వెనుక సైతం సైన్స్ ఉందని మాజీమంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించిన సంక్రాంతి సంబరాలలో భాగంగా పతంగులు ఎగురవేసే కార్యక్రమంలో పాల్గొని పతంగులు ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎండలో గాలిపటాలు ఎగురవేయడం వలన శరీరానికి డి విటమిన్ లభిస్తుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ధర్మవరం బ్రహ్మం, బిఆర్ఎస్ మచ్చవేణుగోపాల్‌రెడ్డి, మణిదీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం హరీష్‌రావు సిద్దిపేటరూరల్ మండలం మాచాపూర్‌గ్రామ చావడి వద్ద గ్రామ పృద్ధులతో అత్మీయంగా ముచ్చటించారు. అలాగే చిన్నకోడూరు మండలపరిధిలోని గంగాపూర్‌లో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొని టాస్‌వేసి మ్యాచ్ ప్రారంభించారు. కాసేపు యువకులతోకలిసి క్రికెట్ ఆడారు. అలాగే చిన్నకోడూరు మండలపరిధిలోని పెద్దకోడూరుగ్రామ వార్డుసభ్యులు మహేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానంచేశారు. ఆయన వెంట బిఆర్ఎస్ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

గణితంలో ఆదుర్తి శ్రీవల్లికి పిహెచ్‌డి

పటాన్‌చెరు, జనవరి 16, ప్రభాతవార్త:

హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్‌లోని గణితశాస్త్రవిభాగం పరిశోధక విద్యార్థిని ఆదుర్తి శ్రీవల్లి డాక్టరేట్‌కు అర్హత సాధించారు. మైక్రోఫ్లూయిడ్ అప్లికేషన్లకోసం మైక్రోఛానల్‌లో విద్యుదయస్కాంతప్రవాహం గణితనమూనా, విశ్లేషణపై ఆమె అధ్యయనంచేసి, సిద్ధాంతవ్యాసాన్ని సమర్పించారు. ఈపరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గణితశాస్త్రవిభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మోతాహర్ రెజా శుక్రవారం ఈ విషయాన్ని వెల్లడించారు. డాక్టర్ శ్రీవల్లి సిద్ధాంతవ్యాసం పిహెచ్‌డి పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డిఎస్ రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డివివిఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రెజా, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందనలు తెలియజేసినట్టు పేర్కొన్నారు.

హేమారెడ్డి మల్లమ్మ ఆలయ నిర్మాణానికి శ్రీకారం

ఆలయ నిర్మాణానికి భూమిపూజలు చేస్తున్న రెడ్లు

న్యాల్‌కల్, జనవరి 16, ప్రభాతవార్త:

మండల పరిధిలోని అమీరాబాద్ గ్రామంలో రెడ్డికులస్థుల ఆరాధ్యదైవం హేమారెడ్డి మల్లమ్మ ఆలయనిర్మాణానికి శుక్రవారం భూమిపూజా కార్యక్రమాలు నిర్వహించి ఆలయ నిర్మాణానికి శ్రీకారంచుట్టారు. కార్యక్రమంలో రెడ్డి జాగృతి సంఘం మండల అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు జగన్నాథ్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగం సాధించిన అఖిల, రాజులకు గ్రామస్థుల అభినందనలు

తొగుట, జనవరి 16, ప్రభాతవార్త:

ఎస్ఎస్‌సి(స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ అస్సాం రిఫైల్స్)ఫలితాల్లో తొగుట గ్రామానికి చెందిన బందారి అఖిల, ముచ్చర్ల రాజు ఉద్యోగం సాధించారు. ఉద్యోగం సాధించిన వీరిరువురినీ సర్పంచి పాగాల శోభకొండలురెడ్డి, గ్రామస్థులు అభినందించారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

-మూసీ రివర్ డిప్యూటీ కలెక్టర్ కోలా శివకుమార్

గెలుపొందిన క్రికెట్ జట్టుకు బహుమతులు అందచేస్తున్న దృశ్యం

చౌటకూరు, జనవరి 16, ప్రభాతవార్త:

క్రీడల్లో గెలుపు ఓటములు సహజమే అని, గెలిచినవారు పొంగిపోవద్దని, ఓడినవారు కుంగిపోవద్దని మూసీరివర్ డిప్యూటీ కలెక్టర్ కోలా శివకుమార్ అన్నారు. మండలపరిధిలోని బొమ్మారెడ్డిగూడెంలో సంక్రాంతిపండగను పురస్కరించుకుని సర్పంచి జైపాల్‌నాయక్ ఆధ్వర్యంలో బిపిఎల్ క్రికెట్ పోటీలు నిర్వహించారు. ముగింపుకార్యక్రమానికి శివకుమార్ ముఖ్యఅతిథిగా హాజరై క్రీడాకారులను ఉద్దేశించి ప్రసంగించారు. క్రీడలతో కలిగే ప్రయోజనాలను వివరించారు. క్రికెట్‌పోటీల్లో ప్రథమస్థానంలో నిలిచిన శివాజీజట్టుకు రూ.10011నగదు, ద్వితీయస్థానంలో నిలిచిన చైతన్యజట్టుకు రూ.5011లను, ట్రోఫీలను అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కందిమండల ట్రాన్స్‌కో ఏఈ ప్రకాశ్, ఉపసర్పంచి రజనీగోపాల్, వార్డుసభ్యులు గోపాల్, సుభాష్, మేనక, శారదబాబులాల్, స్రవంతిగణపతి, కిట్టు, రాజు, మాజీ సర్పంచి మమతరఘునాయక్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి

-మార్కెట్ కమిటీ డైరెక్టర్ చిరు

నీటి ఎద్దడి నివారణకు బోర్లు వేయిస్తున్న దృశ్యం

సదాశివపేట, జనవరి 16, ప్రభాతవార్త:

రాబోయే వేసవికాలంలో నీటి ఎద్దడి రాకుండా ఉండడానికి తన రెండవ వార్డులో ఐదు బోర్లు వేయించానని సదాశివపేట మార్కెట్ కమిటీ డైరెక్టర్ చిరు అన్నారు. ప్రతి సంవత్సరం కూడా శివపురి కాలనీలోని రెండవ వార్డులో నీటిసమస్య తీవ్రంగా ఉందని వేసవికాలంలో నీటి ఎద్దడి చాలా ఉంటుందని భావించి వార్డులోని ప్రజల కోరిక మేరకు తన సొంతనిధులు ఏడు లక్షల 50 వేల రూపాయలు వెచ్చించి ఐదు బోర్లు ఆయన వేయించారు. కార్యక్రమంలో లాజర్, రాహుల్, అశోక్, మనీ, మానేయ్య, షేక్ పాషా, యాదగిరి, జీవన్, తియర్ నరసింహ, జగపతి, రాము, కృష్ణ, సంపత్, శేఖర్, చంద్రయ్య, యాదయ్య, అనిల్‌గౌడ్, రాజు, వరుణ్, లక్ష్మయ్య, మల్లేశంగౌడ్, ఆనందం, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే పేదలకు న్యాయం

-డిసిసి ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజు యాదవ్

చిన్నకోడూరు, జనవరి 16, ప్రభాతవార్త:

కాంగ్రెస్ పార్టీతోనే పేదలకు న్యాయం జరుగుతుందని డిసిసి ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజు యాదవ్ అన్నారు. చిన్నకోడూరు మండల కేంద్రానికి చెందిన పలువురు బిఆర్ఎస్ శ్రేణులు శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు, పార్టీలో చేరినవారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్నివర్గాల అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్ సర్కార్‌తోనే సాధ్యమవుతుందన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి, టిపిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ నాయకత్వంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా రెపరెపలాడించడానికి సైనికుల్లా పనిచేద్దామన్నారు. పార్టీలో చేరినవారు కనకయ్య(యేసు), మీనయ్య, భూమయ్య, రాజయ్య, చంద్రయ్య, యాదగిరి తదితరులు ఉన్నారు.

బురదజల్లే రాజకీయాలు మానుకోవాలి

-మండల ఓబిసి సెల్ కాంగ్రెస్ అధ్యక్షులు బంక చిరంజీవి

విలేకరులతో మాట్లాడుతున్న దృశ్యం

చిన్నకోడూరు, జనవరి 16, ప్రభాతవార్త: బురదజల్లే రాజకీయాలు ఇప్పటికైనా మానుకోవాలని మండల ఓబిసి సెల్ కాంగ్రెస్ అధ్యక్షులు బంక చిరంజీవి సూచించారు. చిన్నకోడూరులో ఆయన శుక్రవారం పార్టీశ్రేణులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. తాను బతికి ఉన్నంత కాలం కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతానని పార్టీ మారే పరిస్థితి లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ పటిష్టతతో పాటు పార్టీ సిద్ధాంతాల కోసం ఎల్లప్పుడూ పనిచేస్తానని తెలిపారు. తనపై తప్పుడు ప్రచారాలు చేస్తే చూస్తూ ఊరుకోనని హెచ్చరించారు. చిన్నకోడూరు గ్రామ పంచాయతీలో తన సతీమణి శ్యామల వార్డు మెంబర్‌గా గెలిచిన నాటి నుంచి తనపై వాట్సాప్ గ్రూపులలో తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో పార్టీ నాయకులు దిలీప్ కోనేటి కరుణాకర్, ఎరువ సత్యనారాయణ, కర్నె శ్రీనివాస్‌రెడ్డి, గంట శ్రీనివాస్, జేరిపోతుల బాబు, సుంచు దేవయ్య, కూర శ్రీనివాస్‌రడెడ్డి, కోన సంతోష్, కాముని కనకరాజు పాల్గొన్నారు.

17న అల్లాదుర్గంలో సిఎం కప్ ర్యాలీ

అల్లాదుర్గం, జనవరి 16, ప్రభాతవార్త:

మండల కేంద్రమైన అల్లాదుర్గంలో ఈ నెల 17న ఉదయం 10 గంటలకు సిఎం కప్ ర్యాలీ నిరర్వహిస్తున్నట్లు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శేషారెడ్డి తెలిపారు. అల్లాదుర్గంలోని బస్టాండ్ ఆవరణలోని మహాత్మా గాంధీ విగ్రహానికి పూజా కార్యక్రమాలు నిర్వహించి పోలీసు ఠాణా వరకు ర్యాలీ నిర్వహిస్తామన్నారు. ర్యాలీలో ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయతీ పాలకులు, మాజీసర్పంచులు, యువత, క్రీడాకారులు తరలివచ్చి పాల్గొని ర్యాలీని విజయవంతం చేయాలని శేషారెడ్డి సూచించారు.

సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకుందాం

-న్యాల్‌కల్ పిహెచ్‌సిలో ఎస్ఐ దోమ సుజిత్

రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ దోమ సుజిత్

న్యాల్‌కల్, జనవరి 16, ప్రభాతవార్త:

రోడ్డు నిబంధనలు పాటిస్తూ వాహనాలపై ప్రయాణంచేస్తే సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవచ్చని ఎస్ఐ దోమ సుజిత్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన న్యాల్‌కల్‌తో మండల పరిధిలోని మిర్జాపూర్ (బి) గ్రామాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకుని డాక్టర్లు, వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జహీరాబాద్ రూరల్ సిఐ జక్కుల హనుమంతు, ఆసుపత్రి డాక్టరు, సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరు రోడ్డు నిబంధనలు పాటించాలి

-వాహన చోదకులతో ప్రతిజ్ఞ చేయించిన డిఎస్‌పి

వాహనదారులతో ప్రమాణం చేయిస్తున్న డిఎస్‌పి సైదానాయక్

జహీరాబాద్, జనవరి 16, ప్రభాతవార్త:

ప్రతి వాహనచోదకులు, పాదచారులు రోడ్డు నిబంధనలు పాటిస్తూ ప్రయాణం చేస్తూ రోడ్డు ప్రమాదాలకు దూరంగా ఉంటామని డిఎస్‌పి సైదానాయక్ అన్నారు. రోడ్డుభద్రత మాసోత్సవాలను పురస్కరించుకుని పోలీసుశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డునిబంధనలు తూచతప్పకుండా పాటిస్తామని, వాహన చోదకులతో డిఎస్‌పి సైదానాయక్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సత్యప్రవీణ్, తహసీల్దార్ పి.దశరథ్, పట్టణ సిఐ శివలింగం, ఎస్ఐ, పోలీసుసిబ్బంది పాల్గొన్నారు.

రోడ్ ప్రమాదాల నివారణపై అవగాహన

-మీ తల్లిదండ్రుల ఆశలను వమ్ముచేయొద్దు: ఎస్సై లక్ష్మీకాంత్‌రెడ్డి

వాహనాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై లక్ష్మీకాంత్‌రెడ్డి

గుమ్మడిదల, జనవరి 16, ప్రభాతవార్త:

గుమ్మడిదల మండలంలోని నల్లవల్లి గ్రామంలో రోడ్ ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గుమ్మడిదల మండల ఎస్సై లక్ష్మీకాంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి కొరివి రాణిసురేష్, వార్డ్ మెంబర్లు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎంపిడిఓ

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపిడిఓ ఆనందమేరీ

పుల్‌కల్, జనవరి 16, ప్రభాతవార్త:

మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రూపొందించిన 2026 నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఎంపిడిఓ ఆనందమేరరీ శుక్రవారం ఆవిష్కరించారు. మండల కేంద్రమైన పుల్‌కల్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపిడిఓ క్యాలెండర్‌ను ఆవిష్కరించి అందరకి పండగ శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని ఎంపిడిఓ పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్యాలయ పర్యవేక్షకులు రాములు, జూనియర్ సహాయకులు జి.మల్లికార్జున్, బి. శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

సిద్దిపేటలో ఏకలవ్యవిగ్రహ ఏర్పాటుకు సన్నాహాలు

విగ్రహ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించి మాట్లాడుతున్న దృశ్యం

సిద్దిపేట అర్బన్, జనవరి 16, ప్రభాతవార్త:

ఏకలవ్యవిగ్రహం ఏర్పాటుకు సంఘసభ్యులు రాజకీయాలకతీతంగా ఐక్యతతో ముందుకుసాగాలని ఏకలవ్య ఎరుకులసంఘం అధ్యక్షులు రాజేష్ఖన్నా అన్నారు. ఎరుకుల కులస్థుల స్ఫూర్తితో ప్రదాత ఏకలవ్యుని విగ్రహ ఏర్పాటుకు సిద్దిపేట పట్టణానికి చెందిన ఎరుకుల సంఘం నాయకులు ముందుకువచ్చారని తెలిపారు. సిద్దిపేట పట్టణంలోని ప్రభుత్వ పశువుల ఆసుపత్రి సమీపంలోని చౌరస్తావద్ద ఏకలవ్యవిగ్రహ ఏర్పాటుకు అనుకూలమైనస్థలంలో సంఘసభ్యులతో కలిసి ఏకలవ్య చిత్రపటాన్ని ఏర్పాటుచేసినట్లు తెలిపారు. పట్టణ ప్రజాప్రతినిధులు, నాయకులు విగ్రహ ఏర్పాటుకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రధానకార్యదర్శి నాగరాజు, ఉపాధ్యక్షులు నర్సింలు, బిజెపి పట్టణ ప్రధానకార్యదర్శి సంతోష్, బిఆర్ఎస్‌నాయకులు శ్రావణ్, రాజేందర్, నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు కెమ్మసారం శ్రీనివాస్, నాయకులు అరుణ, సౌందర్య, వెంకట్, విజయ్, పెంటయ్య, సాత్విక్, చంద్రం, భగవాన్, రాజు, కరుణ్, యాదగిరి, పోచయ్య, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.